ninadam.in

# నినాదం

తెలుగు దినపత్రిక

నిఖార్సైన జర్నలిజం

శనివారం, మార్చి 14, 2026 | సంపుటి - 22 | సంచిక 167 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## తెలంగాణ ఆర్టీసీలో సమ్మె సైరన్



### డిమాండ్లతో కూడిన నోటీస్ ఇచ్చిన జెఎసి

2




**హైదరాబాద్,మార్చి13(నినాదం):** తెలంగాణ ఆర్టీసీలో మరోసారి సమ్మె సైరన్ మోగింది. టీజీఎస్ ఆర్టీసీ కార్మిక సంఘాల నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. శుక్రవారం నాడు బస్ భవన్‌లో ఆర్టీసీ ఉన్నతాధికారులకు జేఏసీ నేతలు సమ్మె నోటీసులు ఇచ్చారు. అనంతరం లేబర్ కమిషనర్ కార్యాలయంలో సమ్మె నోటీసు ఇచ్చారు.

## జగిత్యాల... సీఎంఆర్ దొంగలు @ వెయ్యి కోట్లు!

నెల నెలా ఐదు అంకెల జీతం తీసుకుంటూ ప్రభుత్వ ఉద్యోగం వెలగబెడుతున్న జిల్లా ఉన్నతాధికారులు కూడా రైస్ మిల్లర్ల ఎరకు చిక్కుతున్నారు. దీంతో ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని పట్టపగలు లారీలతో జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతుంది.

- పెనాల్టీ.. రూ 80 కోట్లు
- డిఫాల్టర్లు..రూ 100 కోట్లు
- టెండర్ ప్యాడి.. రూ 500 కోట్లు
- బయల్ మిల్లర్ల దగ్గరే భారీ పెండింగ్..!

**జగిత్యాల ప్రతినిధి, మార్చి13(నినాదం):**

**ప్రభుత్వాలు ఒక తప్పుడు పాలసీని ఇంప్లిమెంట్ చేస్తే లెక్కలేనన్ని దుష్ఫలితాలు ఇస్తుందనడానికి నిదర్శనం ధాన్యం కొనుగోలు అంశం ఒకటి. దీనికి తోడు పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా తోడైంది. దీంతో రైతులు పండించే ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి అప్పనంగా రైస్ మిల్లులకు అప్పచెప్తున్నారు. మిల్లర్లు ధాన్యాన్ని పక్క రాష్ట్రాలకు అమ్ముకొని పిడిఎస్ బియ్యాన్ని సీఎంఆర్ కింద ప్రభుత్వానికి అప్పజెప్తున్నారు.**

గత పదేళ్ల నుంచి రైతులు పండించిన ధాన్యాన్ని వాళ్ళు అడ్డగోలుగా అమ్ముకొని ప్రభుత్వానికి పంగనామాలు పెట్టి విలాసవంతమైన జీవితాలు గడుపుతూ సీఎం ఆర్ లు ఎగదొబ్బిన రైస్ మిల్లర్ల జాబితా సిద్ధమవుతోంది. లక్షల టన్నులు ప్రభుత్వం దగ్గర నుంచి సీఎంఆర్ లుగా తీసుకున్న రైస్ మిల్లర్లు ఆ ధాన్యాన్ని అక్రమార్గంలో రాష్ట్రాన్ని దాటిస్తున్నారు. పీడీఎస్ బియ్యం వ్యాపారాన్ని నమ్ముకొని అధికారులను మచ్చిక చేసుకుని కొద్దో గొప్పో బియ్యాన్ని అప్పజెప్తున్నట్లు నటిస్తున్నారు. డీఎస్ ఓలు, కలెక్టర్లు కిందిస్థాయి అధికారులు అందరూ కలిసి కాగితాలపై తప్పుడు అంకెలు వేసి ప్రభుత్వాన్ని మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారు. రైతు ఆరుగాలం పండించిన కష్టానికి ప్రభుత్వం ధర చెల్లించినా అంతిమంగా ప్రజల డబ్బు లూటీ అవుతుంది అక్రమ రైస్ మిల్లర్లు కోట్లు గడిస్తూ విలాసవంతమైన జీవితాలు అనుభవిస్తున్నారు. ధాన్యం కొనుగోలు చేయడం అనే ఒక తప్పుడు పాలసీ ఉచిత బియ్యం పంపిణీ అనే మరో పాలసీ రెండు తోడై రాష్ట్రాన్ని ఆర్థికంగా చిన్నా భిన్నం చేస్తున్నాయి. అలాగే పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రైస్ మిల్లర్లు, మంత్రులు, ఎమ్మెల్యేల సహాయంతో సీఎంఆర్ ధాన్యాన్ని కేటాయించుకొని తిరిగి ప్రభుత్వానికి చెల్లించకుండా ఎగవేస్తున్నారు.

### ప్రభుత్వాన్ని మోసగిస్తున్న అధికారులు..!

జగిత్యాల జిల్లాలో దాదాపు 1000 కోట్ల ధాన్యం అమ్ముకున్న మిల్లర్లపై అధికారులు చర్యలు తీసుకోవడానికి రాజకీయ ఒత్తిళ్లు అడ్డువస్తున్నట్టు తెలుస్తుంది. జిల్లాలో దాదాపు 100 బాయిల్డ్ రైస్ మిల్లులు ఉన్నాయి. 80రా రైస్ మిల్లులకు 15 మాత్రమే పని చేస్తున్నాయి. వీటి పరిధిలో దాదాపు 1000 కోట్ల వరకు ప్రభుత్వానికి బకాయిలు చెల్లించాల్సి ఉంది. 2024-25 సిఎంఆర్ ధాన్యాన్ని కూడా మిల్లర్లు జిల్లా సరిహద్దులు దాటించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఫిజికల్ వెరిఫికేషన్ చేసారు. దాన్యం లేదని నిర్ధారించి కేసులు పెట్టి చర్యలు తీసుకోకుండా వదిలేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. అలాగే పౌరసరాపరాల శాఖలోనూ అవినీతికి మరిగిన అధికారులు ప్రభుత్వానికి తప్పుడు నివేదికలు ఇస్తున్నట్లు తెలుస్తుంది. జిల్లాలో టెండర్ ప్యాడి కొనుగోలు చేసిన రైస్ మిల్లర్లు ఇంత వరకు తిరిగి బియ్యం అప్పజెప్పడంలో విఫలమయ్యారు. వీరిపై కనీస చర్యలు లేవు. పౌరసరాపరాల శాఖ అధికారులు మిల్లర్లు బకాయి పడ్డ సీఎంఆర్ వివ రాలు అత్యంత గోప్యంగా ఉంచి ప్రభుత్వ ఖజానాకు పరోక్షంగా గండి కొడుతున్నారు. నెల నెలా ఐదు అంకెల జీతం తీసు కుంటూ ప్రభుత్వ ఉద్యోగం వెలగబెడుతు న్న జిల్లా ఉన్నతాధికారులు కూడా రైస్ మిల్లర్ల ఎరకు చిక్కుతున్నారు. దీంతో ప్రభు త్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని పట్టపగ లు లారీలతో జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా యదేచ్ఛగా సాగుతుంది. పట్టుబడ్డ పిడిఎఫ్ బియ్యానికి ప్రత్యేక గుర్తింపు లేకపోవడంతో దొంగలు తప్పించుకుంటున్నారు. ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి పీడియస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుంటున్న కొంత మంది నిజాయితీ అధికారులకు పై అధికారుల నుంచి ప్రోత్సాహం లభించడం లేదు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోలు చేయడం మిల్లర్లకు అప్పజెప్పిన తర్వాత అధికారులు మీనమేషాలు లెక్కిస్తూ ప్రభుత్వ ఖజానాకు చేరాల్సిన ఆదాయానికి అడ్డుపడుతున్నారు




## నేటినుంచి తెలంగాణ పది పరీక్షలు

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం
- సకాలంలో సెంటర్‌కు చేరుకోవాలన్న అధికారులు



2

**హైదరాబాద్,మార్చి13(నినాదం):** తెలంగాణ రాష్ట్రంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ భారీగా ఏర్పాట్లు చేసింది. పరీక్షలు రాసే విద్యార్థులకు ఆర్టీసి ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించింది. హాల్ టిక్కెట్ చూపిస్తే దిగాల్సిన చోటు వరకు ఉచితంగా ప్రయాణం కల్పిస్తారు. ఇకపోతే పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని అధికారులు సూచించారు.

## వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో 8 మంది మృతి

- నిజామాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- టూరిస్ట్ బోల్తాపడి నలుగురు మృతి
- క్షతగాత్రులను ఆస్పత్రికి తరలింపు
- సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు
- బళ్లారి ఘటనలో కర్నూలు దంపతుల దుర్మరణం
- అన్నమయ్య జిల్లాలో మరో ఇద్దరు మృత్యువాత

వివరాలు 2



వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది దుర్మరణం చెందారు. కర్ణాటకలోని బళ్లారి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో కర్నూలు జిల్లాకు చెందిన దంపతులు మృతిచెందారు. అన్నమయ్య జిల్లాలోని ములకలచెరువు హైవే వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. నిజామాబాద్ జిల్లా ఇందల్వాయి మండలంలోని గన్నారం శివారులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో నలుగురు మృతి చెందగా.. పలువురు ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు.

## భారతి బిల్డర్స్ సంస్థకు రూ. 4.74 కోట్ల భారీ జరిమానా

- చట్టవ్యతిరేక ప్రీ లాంచ్ స్కీమ్ పేరుతో డబ్బు వసూలు
- నిబంధనల ఉల్లంఘన కారణంగా డిఫాల్టర్ ప్రమోటర్‌గా ప్రకటన
- కొనుగోలుదారులకు 60 రోజుల్లో నగదు వాపసు చేయాలని ఆదేశాలు
- ఉత్తర్వులు జారీ చేసిన తెలంగాణ రెరా అథారిటీ

2

**హైదరాబాద్, (నినాదం):** మేడ్చల్`మల్కాజిగిరి జిల్లా, కొంపల్లిలోని 'భారతీ లేక్ వ్యూ అపార్ట్‌మెంట్స్' ప్రాజెక్టుకు సంబంధించి భారతీ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థపై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ కఠిన చర్యలు తీసుకుంది.

## మూసీ అభివృద్ధిని బాధ్యతగా తీసుకున్నాం

వివరాలు 2

### 20 టిఎంసిల గోదావరి జలాలు తరలిస్తాం

### అద్భుత నగరాన్ని కాపాడుకునే బాధ్యత మనది



Telangana Chief Minister A Revanth Reddy giving PowerPoint presentation on Musi River Front project on March 13

- ఎవరు సూచనలు ఇచ్చినా తీసుకునేందుకు సిద్ధం
- వరదలు వస్తే ప్రజలు నిరాశ్రయులు అవుతున్నారు
- నదులను ఆక్రమించుకోవడం వల్లనే వరదలు
- ప్రాజెక్టును విమర్శిస్తున్న వారు అక్కడ ఉండగలరా?
- మూసీ ఇన్వెట్స్ కార్యక్రమంలో సిఎం రేవంత్ రెడ్డి

*హైదరాబాద్, (నినాదం): మూసీ అభివృద్ధి బాధ్యతాయుతంగా చేపట్టాలని ప్రయత్నిస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. విదేశాల్లో పలు నదులను సందర్శించి అధ్యయనం చేశారని, ఇప్పటికీ బ్రుహత్కార్యాచరణ చేపట్టకపోతే భవిష్యత్ తరాలు క్షమించవన్నారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్‌డీసీఎల్) ఆధ్వర్యంలో నిర్వహించిన 'మూసీ ఇన్వెట్స' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.*

## ఇరాన్ వ్యూహాత్మక అడుగులు

వివరాలు 6

- అమెరికాపై పట్టుకు వేగంగా కదులుతున్న పావులు
- గల్ఫ్ దేశాలకు ప్రాణ సంకటంగా ఇరాన్ దాడులు
- కూలిన అమెరికా ఈఫ్యూయలింగ్ విమానం
- ఇరాక్‌లో కూలినట్లు ప్రకటించిన అమెరికా
- తామే కూల్చామన్న ఇరాక్ రెబల్స్.. తోసిపుచ్చిన అగ్రరాజ్యం
- రష్యా నుంచి చమురు కొనుగోళ్లు
- భారత్‌కు అనమతించిన అమెరికా వాణిజ్య శాఖ
- ఇందన సంక్షోభానికి తెరదించే యత్నంగా వెల్లడి
- అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి
- ప్రకటించిన ఇరాన్.. తిప్పి కొట్టిన అమెరికా



## అమరావతిని వేగంగా నిర్మించాలి




- రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు
- చిన్నతరహా పరిశ్రమల ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి
- 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం
- 'సఖీ నివాస' పేరుతో పిల్లల సంరక్షణకు హాస్టళ్ల ఏర్పాటు
- ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం
- గ్యాస సరఫరాలో ఇబ్బందులు రాకుండా మంత్రుల పర్యవేక్షణ
- ఎపి కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

వివరాలు 6

## ఎపి హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణం



### ప్రమానస్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్

*ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు.*

వివరాలు 2

## తొలి ఎఐ క్యాంపస్ కాలేజీగా బిట్స్ పిలాని

- మంత్రి లోకేశ్‌తో బిట్స్ ప్రతినిధుల భేటీ
- క్యాంపస్ నిర్మాణ ప్లాన్‌లపై చర్చ
- వేయికోట్లు ఖర్చు చేస్తున్నట్లు వెల్లడి



# రాహుల్.. అపరిపక్వ విపక్షనేత!

సంపాదకీయం

భారత ప్రజాస్వామ్యంలో విపక్ష నేత అంటే బురదజల్లే నేత అని అర్థం రూఢి అవుతోంది. అధికారంలో ఏ పార్టీ ఉన్నా విపక్షంలో ఉన్నవారు నాలుగు రాళ్లు వేయడం, ఇంత బురద జల్లడం, ప్రభుత్వం ఏం చెబుతుందో తెలుసుకోకుండానే సభనుంచి నిష్క మించడం పరిపాటిగా మారింది. సరిగ్గా లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ ఇప్పుడు అదే పాత్రలో ఒదిగి పోయారు. పశ్చిమాసియా యుద్ధంతో ప్రపంచ మంతా వణుకుతోంది. అమెరికా, ఇజ్రాయిల్ ఆయుధ బలంతో ఇరాన్‌ను ధ్వంసం చేయడం ద్వారా ప్రపంచంలోని మారుమూల పల్లె కూడా ప్రభావితం అవుతోంది. మనవద్ద గ్యాస్, ఇంధన కొరతలను ఎదుర్కొంటున్నాం. ఇదేమీ మోడీ తెచ్చుకున్న విపత్తు కాదు. లేదా కావాలని కోరుకున్నదీ కాదు. అధికారంలో కాంగ్రెస్ ఉండివుంటే ఇంతకన్నా దారుణంగా ఉండేది. ఎందుకంటే బిజెపి అధికారంలోకి వచ్చిన తరవాతనే క్రూడాయిల్ దిగుమతి పెరిగింది. ఇంధన సామర్థ్యం పెరిగింది. దేశంలో రిఫనరీల సామర్థ్యం పెంచి వ్యాపారం చేసుకునే స్థాయికి ఎదగింది. గ్యాస్ అందరికీ అందుబాటులోకి వచ్చింది. మారుమూల పల్లెలకు సైతం గ్యాస్ చేరుతోంది. ఇతర దేశాలకు కూడా ఇంధనం సరఫరా చేసే స్థాయికి భారత్ ఎదిగింది. వివిధ దేశాలతో సత్సంబంధాలే ఇందుకు నిదర్శనం. ఇంత సంక్షోభం లోనూ ఇరాన్ మనపట్ల సానుకూలంగా ఉందంటే, మనం అనుసరిస్తున్న విదేశాంగ విధానమే కారణం. రాహుల్ చెప్పటినట్లు నడుచుకుంటే దేశం ఏనాడో భ్రష్టు పట్టిపోయేది. ఇకపోతే ఈ సంక్షోభంలోనూ మనం బంగ్లాదేశ్‌కు ఇంధనం సరఫరా చేయగలి గాం. అయితే ఇవేవీ గమనించకుండా పార్లమెంటులో రాహుల్ చేసిన ప్రసంగం చిన్నపిల్లవాడికన్నా అధ్వాన్నంగా ఉంది. విపక్షనేతకు సమస్యలు, పరిస్థితులు తెలిసి ఉండాలి. కానీ దేశంలో ప్రస్తుతం నెలకొన్న వంట గ్యాస్ కొరతకు, ఎప్‌స్టిన్ ఫైల్స్‌లో పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి పేరు ఉండడానికి సంబంధం ఉందంటూ విపక్షనేత రాహుల్ గాంధీ లోక్‌సభలో గురువారం చేసిన ఆరోపణలు ఆయన అజ్ఞానానికి నిదర్శనంగా చూడాలి. రాజకీయ పరిపక్వత లేని నేత విపక్ష నేతగా ఉన్నందుకు సిగ్గుపడాలి. పశ్చిమాసియా లో జరుగుతున్న యుద్ధం కారణంగా వంట గ్యాస్ కొరత ఏర్పడింది. అయినా కేంద్రం దానిని మానిటర్ చేస్తోంది. ఇంధన భద్రతపై ప్రభుత్వం రాజీ పడినందువల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని రాహుల్ చేసిన విమర్శలు దేశం పట్ల ఆయనకున్న అవగాహన ఇదేనని అర్థం చేసుకోవాలి. దేశ ఇంధన అవసరాలపై అమెరికా ఆంక్షలు విధించే స్థితికి తీసుకొచ్చిందని దుయ్యబట్టారు. మనం ఆయిల్‌ను ఎవరి నుంచి కొనుగోలు చేయాలి, గ్యాస్‌ను ఎక్కడి నుంచి తీసుకురావాలి అన్న నిర్ణయాలను అమెరికాకు విడిచిపెట్టాం అనడంలో అర్థం లేదు. విదేశాల నుంచి వాణిజ్యానికి కూడా కొన్ని పరిమితులు ఉంటాయి. రష్యా నుంచి ఆయిల్ కొనాలా, వద్దా అన్నది కూడా వాణిజ్య ఒపపందాలకు ముడిపడి ఉన్న అంశం. ఈ మాత్రం తెలియని వ్యక్తి విపక్ష నేతగా ఎలా ఉంటున్నారో ప్రజలు తెలుసుకోవాలి. ఇకపోతే మాట్లాడేదంతా మాట్లాడిన అన్నా చెల్లెళ్లు రాహుల్, ప్రియాంకలు ప్రభుత్వం సమాధానం ఇచ్చే వరకు వేచి చూడకుండా సభ నుంచి నిష్క్రమించారు. ఇది చాలు..వారు ఎంత చిత్తశుద్ధిగా ఉన్నారో తెలియడానికి. బయటకు వెళ్లి ధర్నాలు చేయడం తప్ప రాహుల్‌కు తెలిసిందేమీ లేదు. ఇదంతా ఒక ఎత్తయితే ఇరాన్ మన దేశం పట్ల చాలా సానుకూలంగా ఉండడంతో తొలి చమురు నౌక భారత్ చేరుకోగలిగింది. అలాగే రష్యా నుంచి మనం ఇంధన దిగుమతులకు అమెరికా తలూపింది. ఇవన్నీ కూడా విదేశాంగ నీతిలో ఓ భాగం. ఇకపోతే ఈ యుద్ధం ఎప్పటికి ముగుస్తుందో తెలియదు. అందువల్ల దేశంలో ఉన్న ఇంధన వనరులను జాగ్రత్తగా వాడుకోవాల్సిందే. తమ దేశంపై అమెరికా, ఇజ్రాయిల్ అక్రమంగా సాగిస్తున్న యుద్ధానికి సహకరిస్తున్న స్థావరాలను మూసివేయల్సిందిగా పొరుగున గల గల్ఫ్ అరబ్ దేశాలను ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ కోరారు. లేనిపక్షంలో వాటిపై దాడులు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఇరాన్ సుప్రీంనేతగా ఎన్నికైన తర్వాత తొలిసారిగా అమెరికా, ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమంపై తీవ్రంగానే స్పందించారు. పూర్తిగా సాధించేవరకు ప్రతీకారానికి ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించారు. కీలకమైన హార్మూజ్ జలసంధిని గురువారం కూడా మూసివేయాలని ఆదేశించారు. ఇంత జరుగుతున్న ట్రంప్ ఇంకా తన వంకర బుద్ధిని మార్చుకోవడం లేదు. ముడి చమురు ధరల కన్నా కూడా ఇస్లామిక్ రిపబ్లిక్ 'దుష్ట సామ్రాజ్యాన్ని' నిలువరించడమే తమకు మరింత ముఖ్యమని ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఆయన దుర్మార్గాన్ని బయటపెడుతున్నాయి. చమురు ద్వారా లాభాలు ఆర్జించడం కన్నా ఇరాన్ అణ్వాయుధాలను సమకూర్చుకోకుండా అడ్డుకోవాలన్నదే ప్రాధాన్యత అని చెప్పారు. ఇరాన్ అణుశక్తిని సమకూర్చుకోవడాన్ని అనుమతించేది లేదంటూ వ్యాఖ్యానించారు. 'పని పూర్తి చేయాలని' అమెరికా క తనిశ్చయంతో ఉన్నదని ట్రంప్ తెలిపారు. యుద్ధంలో సమర్థవంతంగా విజయాన్ని సాధించామని, అయినప్పటికీ సైనిక చర్యలు కొనసాగుతాయని ఆయన అన్నారు. అయితే తాను ఎప్పుడు అనుకుంటే అప్పుడే యుద్ధం ముగుస్తుం దంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను ఇరాన్ తిప్పికొట్టింది. యుద్ధం ముగింపుపై నిర్ణయం తీసుకోవాల్సింది తామేనని స్పష్టం చేసింది. యుద్ధాన్ని ముగించేందుకు మూడు షరతులు విధించింది. ఇరాన్ సార్వభౌమాధికారాన్ని, చట్టబద్ధమైన హక్కులను గుర్తించాలని, నష్టపరిహారం చెల్లించా లని, భవిష్యత్తులో ఎలాంటి దురాక్రమణలు జరగకుండా అంతర్జాతీయ సమాజం హామీ ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఆ మూడు షరతులు నెరవేరుస్తామని హామీ ఇస్తేనే యుద్ధాన్ని ముగిస్తామని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అందువల్ల ఇప్పట్లో అ కుంపటి చల్లారదని తేలిపోయింది. మనవరకు మనం ఇంధన అవసరాలు తీర్చుకోవడం ముఖ్యం. దేశంలో ఇంధన సంక్షోభ పెచ్చరిల్లుతున్న సమయంలో భారత్‌కు పెద్ద ఊరట లభించింది. భారత్ పతాకంతో ఉన్న నౌకలను హర్మూజ్ జలసంధిని దాటేందుకు ఇరాన్ అనుమతించింది. భారత్, ఇరాన్ విదేశాంగ మంత్రులు జైశంకర్, అబ్బాస్ అరాగ్చీ ఫోన్లో మాట్లాడిన అనంతరం మన దేశానికి ఈ ఉపశమనం దక్కింది. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ నౌకలు క్షేమంగా హర్మూజ్ జలసంధిని దాటాయి. ఇంకా ఇలాంటి ప్రయత్నాలు ఉండనున్నాయి. ఇది ఓ రకంగా మనం అనుసరిస్తున్న విదేశాంగ విధాన విజయానికి సూచిక.

## భారీ జీఎస్టీ కుంభకోణం బట్టబయలు

రూ.84.15 కోట్ల మోసం జరిగినట్లు గుర్తింపు

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ భారీ జీఎస్టీ కుంభకోణాన్ని బయటపెట్టింది. సుమారు రూ.84.15 కోట్ల విలువైన ఐటీసీ మోసం జరిగినట్లు గుర్తించింది. ప్రధాన నిందితుడు, ఎస్‌కేజీ ట్రేడింగ్ కంపెనీ ప్రొప్రైటర్ సందీప్‌ను అధికారులు అరెస్టు చేశారు. నిందితుడు నకిలీ ఇన్వాయిస్‌ల ద్వారా ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందినట్లు గుర్తించారు. సందీప్‌కు సంబంధమున్న ఇతర సంస్థల్లోనూ అక్రమాలు జరిగినట్లు తేలింది. ఈక్రమంలో వాటి రిజిస్ట్రేషన్లను అధికారులు రద్దు చేశారు. సందీప్‌ను జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.

# ఇరాన్ వ్యూహాత్మక అడుగులు



### అమెరికాపై పట్టుకు వేగంగా కదులుతున్న పావులు
### గల్ఫ్ దేశాలకు ప్రాణసంకటంగా ఇరాన్ దాడులు

న్యూఢిల్లీ, నినాదం:

అమెరికా, ఇజ్రాయిల్ కలసి చేస్తున్న యుద్ధంతో ఇప్పుడు ప్రపంచం యావత్తూ అతలాకుతలం అవుతోంది. ప్రధానంగా ఇంధన సంక్షోభంలోకి నెట్టబడ్డాయి. ఈ యుద్ధం నుంచి వెన్నక్కి తగ్గలేక, ముందుకు వెళ్లలేక గింజుకుంటున్నాయి. ఈ యుద్ధంతో ఇజ్రాయిల్ పెద్దగా నష్ట పోకున్నా, అమెరికా మాత్రం ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతోంది. అలాగే ఇరాన్‌ను దెబ్బ తీయాలన్న లక్ష్యం నెరవేరలేదు. అంతేగాకుండా ప్రజల మద్దతుతో ఇరాన్ మరింత బలంగా దాడులను తిప్పికొట్టడానికి సిద్ధం అవుతోంది. ఇది ఓ రకంగా అమెరికాకు పెద్ద నష్టం కానుంది. రష్యా ఉక్రెయిన్‌పై యుద్ధం చేసి కాళ్లూచేతులు కాల్చుకుంటోంది. ఇప్పుడు అమెరికాదీ అదే పరిస్థితి. ఇరాన్ సుప్రీం నేత ఆయతుల్లా ముజ్తబా ఖమేనీ ప్రస్తుత హెచ్చరికలు అమెరికాకు గుణపాఠం కావాలి. అమెరికా, ఇజ్రాయెల్... ఇరాన్‌ల మధ్య యుద్ధం తీవ్రస్థాయి ప్రాదేశిక రాజకీయ సంక్షోభంగా మారింది. ఈ పోరు ఇతర గల్ఫ్ దేశాలకూ, సముద్ర రవాణా మార్గాలకూ, అంతర్జాతీయ ఇంధన మార్కెట్లకూ విస్తరించడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధ వద్ద ఇరాన్ పట్టుతో ప్రపంచ దేశాలకు గమ్యం లేకుండా పోయింది. ఈ పరిస్థితిని అమెరికా అర్థం చేసుకునే స్థితిలో లేదు. ఇరాన్ అధినాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీని అమెరికా, ఇజ్రాయెల్‌లు హతమార్చడం ద్వారా ప్రత్యర్థి దేశపు బలాన్ని అంచనా వేయలేక పోయారు. అధినేతను తొలగిస్తే ఆ దేశాన్ని లొంగదీసుకోవాలన్న ఎత్తుగడలు దెబ్బతిన్నాయి. తమ అధినాయకుడి మరణం లేదా బలిదానం షియా వర్గాన్ని మరింత భీకర ప్రతిఘటనకు పురిగొల్పుతుంది. తమ అధినేత మరణం ప్రజల్లో ప్రతీకారేచ్ఛను పెంచుతుంది. దేశాన్ని బలహీనపరచే బదులు ప్రభుత్వానికి ప్రజల మద్దతును మరింత విస్తృతం చేస్తుంది. సైనిక దాడుల్లో సాధారణ పౌరులు మరణించడం ద్వారా అమెరికా తలనొప్పులు తెచ్చుకుంది. పలు ప్రాంతాల్లో ప్రజాగ్రహాన్ని పెంచుతోంది.

బాధితుల వివరాలు సామాజిక మాధ్యమాల్లో, పత్రికలూ టీవీ ఛానళ్లలో వేగంగా ప్రసారమవుతూ అంతర్జాతీయ ప్రజాభిప్రాయాన్నీ, దౌత్య సంబంధాలనూ ప్రభావితం చేస్తున్నాయి. మరోవైపు, తనపై అమెరికా, ఇజ్రాయెల్ ఉమ్మడి దాడికి సహకరించిన ఇతర గల్ఫ్ దేశాలపై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఖతార్, బహ్రెయిన్, కువైట్ తదితరాలపైనా... ముఖ్యంగా అక్కడి అమెరికా సైనిక స్థావరాలపైనా డ్రోన్లు, క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ నేరుగా అమెరికా భూభాగంపై దాడి చేయలేక పోవచ్చు కానీ, పశ్చిమాసియాలోని అమెరికా సైనిక వసతులను కకావికలం చేయగలదు. అందుకనే గల్ఫ్ దేశాలు ఇప్పుడు సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి. ఇలా జరుగుతందని అమెరికా ఊహించకపోవడం కూడా యుద్ధ వైఫల్యంగానే భావించాలి. ఓ రకంగా ఇరాన్ తెలివిగా అమెరికాను దెబ్బతీస్తోంది. అనేక గల్ఫ్ దేశాలు తమ విధానాలకు అనుగుణంగా అగ్రరాజ్య స్థావరాలకు ఆతిథ్యమిస్తున్నాయి. ఈ స్థావరాలు పశ్చిమాసియా అంతటా నిఘా కార్యకలాపాలు, నౌకాదళ మోహరింపులు, యుద్ధ విమానాల ప్రయాణాలకు వీలుకల్పిస్తున్నాయి. ప్రస్తుత యుద్ధంలో ఈ స్థావరాలపై ఇరాన్ గురిపెట్టడం ద్వారా అమెరికాను దెబ్బ కొట్టడంలో క్రుతకత్యమయ్యిందనే చెప్పాలి. అందుకే ఇరాన్‌పై దాడి ద్వారా అమెరికా సాధించింది సున్నాయే కాక, ఈ యుద్ధంలో విజేత ఇరాన్ అనే చెప్పాలి. ఈ క్రమంలో తటస్థంగా ఉండాలని భావించిన దేశాలు కూడా ఇప్పుడు యుద్ధంలో ఇరుక్కుపోయే పరిస్థితి ఏర్పడింది. ఇంధన సరఫరా గొలుసులకు కేంద్రమైన పశ్చిమాసియా మొదటి నుంచీ అగ్రరాజ్యాల పోటీకి వేదికగా ఉంది. రష్యా, చైనాలకు ఇరాన్‌తో వ్యూహాత్మక సంబంధాలున్నాయి. అవి నేరుగా జోక్యం చేసుకోకున్నా` దౌత్య, ఆర్థిక మద్దతుతో ప్రభావితం చేస్తున్నాయి. హర్మూజ్ జలసంధి ఇరాన్ అదుపులో ఉండటం ఆ దేశానికి వ్యూహాత్మక బలంగా చూడాలి. అదే తమ ట్రంప్ కార్డు అని ఇరాన్ నూతన అధినేత కూడా వ్యాఖ్యానించారు. ఇకపోతే గల్ఫ్ పరిణామాలు భారతదేశంపై ప్రత్యక్షంగా ప్రభావం చూపుతున్నాయి. ఇండియా ముడి చమురు కోసం పశ్చిమాసియాపైనే ఎక్కువగా ఆధారపడుతోంది. హర్మూజ్ జలసంధి ద్వారా నౌకల రాకపోకలకు అంతరాయం కలగడంతో అది భారతదేశ ఇంధన భద్రతను, ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీస్తోంది. అయితే ఇవన్నీ ఇప్పట్లో కలొఇక్కి వస్తాయని అనుకోవడానికి లేదు. ప్రత్యమ్నాయాలు చూసుకోవాల్సిందే.

### అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి

టెహ్రాన్ :

అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ యుద్ధ విమానాన్ని ఢీకొట్టాయని వెల్లడించింది. దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని పేర్కొంది. అయితే అమెరికా ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఇరాన్‌పై అమెరికా చేస్తోన్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి ఈ నౌక మద్దతు ఇస్తూనే ఉందంటూ ఇరాన్ ప్రకటనలను ఖండించింది. ఈమేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స' వేదికగా పోస్టు పెట్టింది. అమెరికా మీడియా కథనాల ప్రకారం.. అబ్రహం లింకన్‌కు అతిదగ్గరగా ఓ ఇరాన్ పడవ వచ్చింది. దానిని గుర్తించిన అమెరికా దళాలు కాల్పులు జరిపాయి. అయితే ఈ ఘటనలో యూఎస్ నౌక దెబ్బతిన్నదా, లేదా అని మాత్రం పేర్కొనలేదు. ఇక, ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ సేనలు దీనిని దక్షిణ చైనా సముద్రం నుంచి పశ్చిమాసియాకు తరలించాయి. ఇందులో ఎనిమిది స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు ఉంటాయి. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. యుద్ధం ప్రారంభమైన మూడు రోజుల తర్వాత నాలుగు క్షిపణులతో దాడి చేశామని చేసిన ప్రకటన కలకలం సృష్టించింది. అయితే ఆ ప్రకటనలో నిజం లేదని అప్పుడు కూడా అమెరికా తోసిపుచ్చింది. ఇరాన్ వద్ద భారీస్థాయిలో హైపర్‌సోనిక్, నౌకా విధ్వంసక క్షిపణులు ఉన్నప్పటికీ అవి అమెరికన్ విమాన వాహక నౌకను తాకడం దాదాపుగా అసాధ్యమనే చెబుతుంటారు. విమాన వాహక నౌక ప్రధాన బలం దాని మీద ఉండే యుద్ధ విమానాలే. యూఎస్‌ఎస్ అబ్రహం లింకన్‌పై ఎఫ్/ఏ`18 సూపర్ హార్నెట్, ఎఫ్`35సి స్టెల్త్ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు సహా అనేక విమానాలు ఉన్నాయి. ఇవి శత్రువుపై దాడి చేయడంతోపాటు విమాన వాహకనౌకను రక్షించే సామర్థ్యాన్ని కలిగిఉన్నాయి. పోరు సమయంలో విమాన వాహక నౌక సాగరంలో స్థిరంగా ఉండదు. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో కదులుతుంటుంది. రియల్‌టైమ్ ఉపగ్రహ నెట్‌వర్క్ లేకుండా దీని జాడను ఎప్పటికప్పుడు పసిగట్టడం కష్టం. యూఎస్‌ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో.. ఇరాన్ తీరానికి దూరంలో వ్యూహాత్మక ప్రదేశంలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇరాన్ సమీపంలో మోహరించిన అమెరికా విమాన వాహక నౌక యూఎస్‌ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ లో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. 'జెరాల్డ్‌లోని లాండ్రీ ప్రదేశాల్లో ఈ మంటలు చెలరేగాయి. అయితే అందుకు యుద్ధం కారణం కాదు. ఆ మంటలను ఆర్పేశాం. నౌకలోని ప్రొపల్షన్ ప్లాంట్‌కు ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. గాయపడిన ఇద్దరు నావికులకు చికిత్స అందుతోంది. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నౌక ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఎర్రసముద్రంలో తన సహకారాన్ని కొనసాగిస్తోందని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

# రష్యా నుంచి చమురు కొనుగోళ్లు

న్యూఢిల్లీ, నినాదం:

ఇరాన్ ` ఇజ్రాయెల్, అమెరికాల ఉద్రిక్తతల నేపథ్యంలో తీవ్ర ఇంధన సంక్షోభం ఎదుర్కొంటున్న వేళ ప్రపంచ దేశాలకు కాస్త ఉపశమనం లభించింది. రష్యా చమురు కొనుగోలుకు స్వల్పకాలికంగా అనుమతినిస్తూ అమెరికా ఉత్తర్వులు జారీ చేసింది. సముద్రంలో నిలిచిపోయిన చమురును కొనుగోలు చేసేందుకు ఏప్రిల్ 11 వరకు అవకాశం కల్పించింది. ఇరాన్ ` ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న అనిశ్చితిని తొలగించేందుకు అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. మధ్యప్రాచ్యంలో యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో పెట్రోల్, డీజిల్ ధరలు సామాన్యుడికి భారంగా మారుతున్న తరణంలో గ్లోబల్ ఎనర్జీ మార్కెట్‌లో స్థిరత్వాన్ని తీసుకు రావడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టినట్టు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ 'ఎక్స' వేదికగా వెల్లడించారు. 'ప్రపంచ ఇంధన మార్కెట్‌లో స్థిరత్వాన్ని పెంపొందించడం, ధరలను అదుపులో ఉంచేందుకే ట్రంప్ ఈ నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతానికి సముద్రంలో నిలిచిపోయిన చమురు రవాణాకు మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయి' అని బెసెంట్ స్పష్టం చేశారు. రష్యాపై ఆంక్షలు అమల్లో ఉన్నప్పటి కీ అమెరికా తాత్కాలిక సడలింపులతో పుతిన్ ప్రభుత్వానికి పెద్దగా ఆర్థిక ప్రయోజనం ఉండదని బెసెంట్ అన్నారు. రష్యాకు వచ్చే ఆదాయంలో అధిక భాగం చమురు వెలికితీసే సమయంలోనే పన్నుల రూపంలో అందుతుందని, ఇప్పుడు రవాణాలో ఉన్న చమురు అమ్మకం వల్ల వారికి అదనపు ప్రయోజనమేమీ ఉండదని ఆయన వివరించారు. ఈ నిర్ణయం వల్ల స్వల్ప కాలికంగా ధరలు పెరిగినా.. దీర్ఘకాలంలో అమెరికా ఆర్థిక వ్యవస్థకు ఇది ఎంతో మేలుచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. అయితే.. తాజా సడలింపులతో మార్చి 12 నాటికి నౌకల్లో లోడ్ అయిన రష్యా ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తులను ఏప్రిల్ 11 వరకు విక్రయించుకోవచ్చు. గతంలో అమెరికా ఆంక్షలు విధించిన రష్యన్ సంస్థల నుంచి ఉత్పత్తైన చమురును కూడా ఇప్పుడు కొనుగోలు చేసుకోవచ్చు. ఇకపోతే ప్రపంచ దేశాల్లో ఇంధన సంక్షోభం తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో భారత్‌కు ఇరాన్ ఉపశమనం కలిగించింది. భారతీయ ట్యాంకర్లను హోర్ముజ్ జలసంధి గుండా వెళ్లేందుకు అనుమతించింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుబ్రమణ్యం జైశంకర్, ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మధ్య జరిగిన చర్చల అనంతరం.. భారత జెండాలు కలిగిన నౌకలకు టెహ్రాన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు పలు మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ పరిణామంతో అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపా దేశాలకు చెందిన నౌకలు ఆంక్షలు ఎదుర్కుంటున్నప్పటికీ.. పుష్పక్, పరిమళ్ అనే రెండు భారతీయ ట్యాంకర్లు వ్యూహాత్మకంగా హోర్ముజ్ జలసంధిని దాటినట్టు పేర్కొన్నాయి. అమెరికా, ఇజ్రాయెల్ ప్రయోజనాలకు సంబంధంలేని నౌకలకు మాత్రం ఆంక్షల నుంచి సడలింపునిచ్చింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ప్రారంభమైన తర్వాత తొలిసారిగా భారతీయ నౌకలు జలమార్గం గుండా సురక్షితంగా ప్రయాణించడం విశేషం.

### కూలిన అమెరికా ఈఫ్యూయలింగ్ విమానం

వాషింగ్టన్, నినాదం:

అమెరికా వాయుసేనకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ`135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో గురువారం కుప్పకూలింది. అయితే ఈ ప్రమాదంలో ఎంతమంది సిబ్బంది ప్రాణాలు కోల్పోయారో అమెరికా అధికారులు ప్రకటించలేదు. సహాయ కార్యక్రమాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈ ఘటనపై అమెరికా సెంట్రల్ కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. రెండు సైనిక ట్యాంకర్ విమానాలు ల్యాండ్ అవుతుండగా ఈ ఘటన జరిగినట్లు వెల్లడించింది. రెండో విమానం సురక్షితంగా దిగినట్లు పేర్కొంది. మరోవైపు ఇరాక్‌కు చెందిన ఇస్లామిక్ రెసిస్టెన్స్ రెబల్ గ్రూప్ తామే అమెరికా విమానాన్ని కూల్చేసినట్లు ప్రకటించింది. ఈ గ్రూప్ ఇరాన్‌కు అనుకూలంగా పనిచేస్తోంది. ఆ సంస్థ అధికారిక టెలిగ్రామ్ ఛానెల్‌లో ఈ విషయాన్ని వెల్లడించింది. అయితే ఈ ప్రకటనను అమెరికా సెంట్రల్ కమాండ్ తోసిపుచ్చింది. శత్రువుల దాడి లేదా ఫ్రెండ్లీ ఫైర్‌లో ఇది కూలిపోలేదని వెల్లడించింది. ఈ ఘటనలో ఆరుగురు సిబ్బంది చనిపోయినట్లు ఇరాన్ మీడియా చెబుతోంది. వందల సంఖ్యలో అమెరికా, ఇజ్రాయెల్ విమానాలు దాడులకు వెళుతుండటంతో ట్యాంకర్ విమానాల అవసరాలు గణనీయంగా పెరిగాయి.

# అమరావతి నిర్మాణాలు మరింత వేగవంతం

నిర్మాణ పనుల వేగంగా పూర్తికి అనుమతి
రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులు మంజూరు
చిన్నతరహా పరిశ్రమల ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి
3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం
'సఖీ నివాస' పేరుతో పిల్లల సంరక్షణకు హాస్టళ్ల ఏర్పాటు
ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం
గ్యాస సరఫరాలో ఇబ్బందుల రాకుండా మంత్రుల పర్యవేక్షణ
ఎపి కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాలు

అమరావతి :

అమరావతిలో ప్రతిష్ఠాత్మకమైన సచివాలయం, ప్రభుత్వ విభాగాధిపతుల టవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ భవనాల్లో మెకానికల్, ఎలక్ట్రికల్, ప్లంబింగ్ పనుల కోసం రూ.2,316 కోట్ల పరిపాలన అనుమతులను మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రాజధానిలో తెలుగు సంస్కతిని చాటిచెప్పేలా రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి ఆమోదం తెలిపారు. అమరావతిలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులపై మంత్రివర్గ ఉపసంఘం ఇచ్చిన ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన శుక్రవారం మంత్రివర్గ సమావేశం నిర్వహించారు. దీనిలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ముఖ్యంగా రాజధాని అమరావతి నిర్మాణం నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకు పలు అంశాలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. సీఎం చంద్రబాబు నేతృత్వంలో శుక్రవారం జరిగిన ఏపీ మంత్రివర్గ సమావేశం రాష్ట్ర ప్రగతికి దిశానిర్దేశర చేసింది. చిన్నతరహా పరిశ్రమలను ప్రోత్సహించడం ద్వారా 17 వేల మందికి కొత్తగా ఉపాధి కల్పించాలని నిర్ణయించారు. దీనికోసం 3,500 సూక్ష్మ పరిశ్రమలకు రూ.300 కోట్ల ఆర్థిక సాయం అందించనున్నారు. మహిళా ఉద్యోగుల కోసం 'సఖీ నివాస' పేరుతో పిల్లల సంరక్షణ సౌకర్యాలు కలిగిన హాస్టళ్లను ఏర్పాటు చేయనున్నారు. పోలీసు శాఖలో 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను రిజర్వ్ సబ్ ఇన్ స్పెక్టర్ పోస్టులుగా అప్‌గ్రేడ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంప`లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలను చేర్చాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపనున్నారు. పోలవరం ప్రాజెక్టులో కీలకమైన పనుల కోసం దాదాపు రూ.48 కోట్లను అదనంగా కేటాయించారు. మే 15 నాటికి సాగునీరు విడుదల చేయాలని, ఆ లోపు కాలువలు, డ్రెయిన్ల మరమ్మతుల కోసం 'జలధార' కార్యక్రమాన్ని ఏప్రిల్ 2 నుంచి 90 రోజుల పాటు చేపట్టాలని సీఎం ఆదేశించారు. అమరావతి అభివృద్ధి, ఉపాధి సృష్టి, జలవనరులు, వ్యవసాయం, పరిశ్రమలు, పర్యాటకం, విద్యుత్ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకుంది. సీఆర్డీఏ నిర్ణయాలకు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.తిరుపతి, విజయవాడ, విశాఖ అప్పీల్ కార్యాలయాల పరిధిపై నిర్ణయం తీసుకున్నారు. ఏపీ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ చట్ట గెజిట్‌కు ఆమోదం పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్‌లో పోలవరం, మార్కాపురం జిల్లాలు చేర్చే ప్రతిపాదనలను కేంద్రానికి పంపే అజెండాకు అమోదం. పోలవరం ప్రాజెక్ట్ హెడ్ వర్క్స్‌లో అదనపు గ్రానైట్ కొనుగోలు, లైనింగ్ పనులకు రూ.23.47 కోట్లు కేటాయింపు, పోలవరం ప్యాకేజ్`64 పనులకు రూ.24.51 కోట్లు మంజూరుకు అనుమతి లభించింది. ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్‌లో అత్యవసర మరమ్మతు పనులకు నిధుల మంజూరు చేస్తూ ఆమోదించింది. క్యాబినెట్‌లో అజెండా అంశాలు ముగిసిన తర్వాత వివిధ అంశాలపై సీఎం చర్చించారు. గ్యాస్ కొరత రాకుండా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. కొందరు గ్యాస్‌కు బదులుగా ఎలక్ట్రిక్ స్టవ్‌లు వాడుతున్నారని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ఎలక్ట్రిక్ స్టవ్‌లతో విద్యుత్ డిమాండ్ పెరగడంతో పరిస్థితి పర్యవేక్షించాలని సీఎం సూచించారు. ఏప్రిల్ 2న శాఖల పనితీరుపై నివేదికలు ఇస్తానని, వాటి ఆధారంగా సమీక్ష చేసుకొని పురోగతి సాధించాలని సూచించారు. ఏప్రిల్ 2 నుంచి 90 రోజులపాటు జలధార కార్యక్రమం చేపట్టాలన్నారు. కాలువలు, డ్రెయిన్లు శుభ్రం చేయించి భూగర్భ జలాలను పెంచాలన్నారు. మే 15 నాటికి సాగునీరు విడుదల చేయాలని సీఎం ఆదేశించారు. చివరి ఎకరానికి కూడా నీరిచ్చేలా జలధార కార్యక్రమం జరగాలని సీఎం ఆదేశించారు. కేబినెట్ అజెండా ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు గ్యాస్ సరఫరా, విద్యుత్ వినియోగంపై చర్చించారు. పశ్చిమాసియా



సంక్షోభం కారణంగా గ్యాస్ కొరత ఏర్పడకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. గ్యాస్ కొరత వల్ల ప్రజలు ఎలక్ట్రిక్‌స్టవ్‌ల వైపు మళ్లుతున్నారని, దీనివల్ల విద్యుత్ డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 2న ప్రభుత్వ శాఖల పనితీరుపై నివేదికలు విడుదల చేస్తానని.. ఆ ఆధారంగా మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని మంత్రులకు దిశానిర్దేశంచేశారు.

# బీరతో ఆరోగ్యం బాగు..

## కంటిచూపు, మధుమేహం వరకు అన్నింటికీ చెక్!



**మధుమేహం నియంత్రణ:**
బీరకాయలో ఉండే కొన్ని ప్రత్యేక పోషకాలు రక్తంలోని చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించడంలో సహాయపడతాయి. ముఖ్యంగా 'నేతి బీరకాయ' డయాబెటిస్ రోగులకు ఇన్సులిన్ లాంటి మేలును చేకూరుస్తుంది.

**జీర్ణక్రియ, మలబద్ధకం:**
ఇందులో నీటి శాతం మరియు ఫైబర్ (పీచు) అధికంగా ఉండటం వల్ల జీర్ణక్రియ సాఫీగా సాగుతుంది. దీర్ఘకాలిక మలబద్ధకంతో బాధపడేవారు బీరకాయను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది పొట్టలోని మలినాలను క్లీన్ చేసి గ్యాస్ సమస్యలను తగ్గిస్తుంది.

**బరువు తగ్గడం, బెల్లీ ఫ్యాట్:**
బీరకాయలో క్యాలరీలు చాలా తక్కువ. ఇది తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్న అనుభూతిని కలిగిస్తుంది, దీనివల్ల అతిగా తినడం తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే వారు మరియు పొట్ట చుట్టూ ఉన్న కొవ్వును కరిగించుకోవాలనుకునే వారికి ఇది ఒక 'సూపర్ ఫుడ్'.



**కంటి చూపు, గుండె ఆరోగ్యం:**
బీరకాయలో ఉండే బీటా కెరోటిన్ కంటి చూపును మెరుగుపరుస్తుంది. అలాగే, ఇది శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి, గుండె పనితీరును మెరుగుపరుస్తుంది. రక్తపోటును నియంత్రించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తుంది.

**చర్మ సౌందర్యం:**
రక్తశుద్ధి చేయడంలో బీరకాయ సహాయపడుతుంది. దీనివల్ల మొటిమలు, మచ్చలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది. లోపలి నుండి శరీరాన్ని హైడ్రేట్ గా ఉంచడం వల్ల చర్మం తాజాగా కనిపిస్తుంది. తక్కువ ధరలో లభించే ఈ బీరకాయను వారంలో కనీసం రెండు సార్లు ఆహారంలో భాగంగా చేసుకోవడం వల్ల పైన పేర్కొన్న ఎన్నో ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం పొందవచ్చు.

# సాపేక్షత సిద్ధాంతకర్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్

జర్మనీలోని ఉల్మ్ అనే ప్రాంతంలోనే ఒక యూదు కుటుంబంలో హెర్మన్-పౌలిన్ దంపతులకు 14 మార్చి 1879 రోజు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ జన్మించారు. చిన్నతనంలో మాట్లాడడమే కష్టంగా ఉండేది. కుటుంబం పలు ప్రాంతాలకు మారిన తర్వాత పావియా నగరంలో స్థిరపడ్డాడు. చిన్నతనంలో మతపరమైన వ్యక్తిగా మారిన తర్వాత పిల్లల సైన్స్ సీరీస్ పుస్తకాలను చదవడంతో మత విశ్వాసాలకు విరుద్ధంగా శాస్త్రీయ కోణంలో ఆలోచించడం మొదలు పెట్టాడు. 1880లో మునిచ్‌కు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కుటుంబం మారిన తర్వాత అక్కడే ప్రాథమిక పాఠశాల విద్య చదివారు. సిట్జర్లాండ్‌లో మాధ్యమిక విద్య, జురిచ్‌లో పాలిటెక్నిక్ పూర్తి చేసాడు.

**సాధారణ సాపేక్షత సిద్ధాంత రూపశిల్పి:**
1905లో జురిచ్ యూనివర్సిటీ నుంచి పి హెచ్‌డి పట్టా అందుకున్నారు. జురిచ్/బెర్న్/చార్లెస్/హంబోల్ట్/లైడెన్/ఆక్స్‌ఫర్డ్ లాంటి పలు యూనివర్సిటీల్లో ప్రొఫెసర్‌గా పని చేస్తూ పరిశోధనలు కొనసాగిస్తూ 1916లో "సాధారణ సాపేక్షత సిద్ధాంతాన్ని" ప్రతిపాదించారు. స్విస్, జర్మన్, అమెరికా పౌరసత్వాలు కలిగిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చేసిన పరిశోధనా ఫలితాల ఆధారంగా 1921లో భౌతికశాస్త్రంలో నోబెల్ బహుమతి పొందారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒక శరణార్థిగా ఇతర శరణార్థుల చేయూతను ఇచ్చారు. జాత్యహంకారాని వ్యతిరేకంగా గళం ఎత్తిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ చిన్నతనంలో ఆలస్యంగా మాట్లాడడం ప్రారంభించారు. ప్రసిద్ధ ఆవిష్కరణలు చేస్తూనే పేటెంట్స్ క్లర్క్‌గా పని చేశారు. మానవత్వ సంక్షోభాల బారినపడిన అభాగ్యుల జీవితాల్లో వెలుగులు నింపడానికి "ఐఆర్‌సి (ఇంటర్నెషనల్ రిలీఫ్ అసోసియేషన్)"ను స్థాపించి ప్రపంచ శాంతి స్థాపనకు పునాదులు వేశారు.

**ద్రవ్యరాశి-శక్తి తుల్యతా నియమం, కాంతి విద్యుత్ ప్రభావ ప్రదాత:**



జర్మనీకి చెందిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ భౌతికశాస్త్రంలో ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తగా "సాధారణ సాపేక్షత సిద్ధాంతాన్ని (జనరల్ థియరీ ఆఫ్ రిలెటివిటీ)" ప్రతిపాదించడంతో పాటు "ద్రవ్యరాశి-శక్తి తుల్యతానియమాన్ని (మాస్ ఎనర్జీ ఈక్వివలెన్స్)" లేదా "ఇ = ఎమ్2 సమీకరణం" అందించారు. ఒక తత్వశాస్త్రవేత్తగా కూడా ప్రభావవంతమైన కృషి చేశారు. క్వాంటం థియరీ పరిణామ క్రమంలో అతి ముఖ్యమైన "ఫోటో ఎలెక్ట్రిక్ ఎఫెక్ట్"ను కనిపెట్టి 1916లో నోబెల్ బహుమతిని పొందారు. స్టాటిస్టికల్ మెకానిక్స్, క్వాంటం థియరీ, పార్టికల్ థియరీ, అణువుల చలనాల గూర్చి లోతైన అధ్యయనాలు చేశారు. హిట్లర్ అధికారంలోకి వచ్చాక జర్మనీ వదిలి అమెరికాలోకి బెర్లిన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్‌లో ఆచార్యులుగా పని చేసారు. సాధారణ సాపేక్షత సిద్ధాంతంతో పాటు ప్రత్యేక సాపేక్షత సిద్ధాంతం, బ్రౌనియన్ మోషన్ సిద్ధాంతం, ఐన్‌స్టీన్ ఫీల్డ్ సమీకరణం, కాస్మలాజికల్ సిద్ధాంతం, బోస్-ఐన్‌స్టీన్ గణాంకాలు, బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్, గురుత్వాకర్షణ తరంగం, ఏకీకృత క్షేత్ర సిద్ధాంతం, ఈపిఆర్ పారడాక్స్, సమిష్టి వివరణ లాంటి పలు అంశాలను కనుగొన్నారు.

**30,000 వరకు శాస్త్రీయ పరిశోధనా పత్రాల ప్రతిపాదనలు:**
తన జీవితకాలంలో 300లకు పైగా శాస్త్రీయ పరిశోధనా వ్యాసాలు, 150కి పైగా ఇతర వ్యాసాలను వివిధ అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించి ప్రపంచ భౌతిక శాస్త్రవేత్తలకు దారి దీపంగా నిలిచారు. 2014లో ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ పరిశోధనలకు చెందిన 30,000 శాస్త్రీయ పత్రాలను విడుదల చేయడం కూడా జరగడం మహా అద్భుతం. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ శాస్త్ర పరిజ్ఞానానికి మెచ్చిన అంతర్జాతీయ పౌర శాస్త్ర సమాజం నోబెల్ బహుమతితో పాటు మాక్స్ ప్లాంక్ మెడల్, 20వ శతాబ్దపు ప్రముఖ వ్యక్తి, బర్నార్డ్ మెడల్, మాట్యూచి మెడల్, కోప్లీ మెడల్, రాయల్ ఆస్ట్రనామికల్ సొసైటీ బంగారు పతకం లాంటి అనేక పురస్కారాలను పొందారు.

ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఒక నోబెల్ బహుమతి గ్రహీత మాత్రమే కాదని, ఆయన ఒక ప్రపంచ శాంతి దూతగా నిలిచాడని ఆయన సుసంపన్న జీవితం వివరిస్తున్నది. మితిమీరిన జాతీయతావాదం ఒక శిశు వ్యాధి లాంటిదని, దానితో ప్రమాదమని ప్రచారం చేశారు. అణుశక్తి, ఆయుధాల అవసరం లేదని ప్రపంచ శాంతి పాఠాలను ప్రచారం చేసిన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ ఆధునిక భావాలు నేటి తరం పౌరులకు దారి దీపాలుగా నిలుస్తున్నాయని గమనించారు. ఐన్‌స్టీన్ అద్భుత మేధస్సు నేటి డిజిటల్-ఏఐ యుగానికి కూడా పునాదిగా మారిందని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఆయన శాస్త్రీయ ఆవిష్కరణలను ఆకళింపు చేసుకుంటూ ముందుకు సాగాలని నేటి యువతను కోరుకుందాం.

– డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

## ఈజీగా అయిపోయే పాలకూర అట్టు..

### మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌కు ఇదే పర్ఫెక్ట్



కావాల్సిన పదార్థాలు : ఒక కట్ట పాలకూర, 2 కప్పులు బియ్యపు పిండి, ఐదు పచ్చిమిర్చి, ఒక టేబుల్ స్పూన్ అల్లం పేస్ట్, అర టీ స్పూన్ జీలకర్ర, రుచికి తగినంతా ఉప్పు, నూనెను వేసుకోవాలి

పాలకూర పేస్ట్: ముందుగా పాలకూరను తీసుకుని నీటితో రెండు మూడు సార్లు కడిగి, ఆ తర్వాత పచ్చిమిర్చి, అల్లాన్ని మిక్సీ జార్‌లో వేసి, నీటిని పోసి మెత్తగా పేస్ట్‌లాగా చేసుకోవాలి.

పిండి కలుపుకోవడం: ఈ పాలకూర పేస్ట్ మిశ్రమాన్ని ముందుగా రెడీ చేసుకుని పక్కన పెట్టుకున్న దోస పిండిలో వీటిని వేసి మిక్స్ అయ్యేలా బాగా కలపాలి. ఇంకా చెప్పాలంటే అవసరమైతే దానిలో ఒక గ్లాస్ నీరు, అర టీ స్పూన్ జీలకర్ర, రుచికి సరిపడా ఉప్పు వేసి దోస పిండి లాగా దీనిని కలిపి రెడీ చేసుకోవాలి.

దోస వేయడం: ఇక ఇప్పుడు స్టవ్ వెలిగించి పెనం పెట్టి, దాని మీద కొద్దిగా ఆయిల్ వేసి, అది వేడయ్యాక ఒక గరిటె పిండిని దాని వేసి దోసలాగా వేసుకోవాలి.



మరి హై మీద కాకుండా మీడియం మంట మీద దానిని ఉంచి దోసను రెండు వైపులా రంగు మారే వరకు కాల్చుకోవాలి. అలా కాల్చిన పాలకూర అట్టును ఒక ప్లేట్ లోకి తీసుకోండి. అంతే, వేడి వేడి పాలకూర అట్టు రెడీ

# పొట్ట కొవ్వును కరిగించే సింపుల్ యోగాసనం..

## ఈజీగా స్లిమ్ అవుతారు పక్కా!

శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వు, ముఖ్యంగా పొట్ట భాగంలో పేరుకుపోయిన అడిపోస్ టిష్యూస్ ఆరోగ్యం, అందం రెండింటికీ చాలా ముఖ్యమైనవి. ఈ భాగంలో కొవ్వు ఎక్కువగా పేరుకుపోవడం వల్ల శరీరాకృతి దెబ్బతినడమే కాకుండా, అనేక ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు. జిమ్‌కు వెళ్లకుండా, ఇంట్లోనే సహజంగా స్లిమ్ అవ్వాలనుకునే వారికి ఒక అద్భుతమైన యోగాసనం ఎంతో సహాయపడుతుంది. ఈ యోగాసనం కేవలం కొవ్వును తగ్గించడమే కాకుండా, అంతర్గత అవయవాల పనితీరును కూడా మెరుగుపరుస్తుంది. అదేలాగో ఇక్కడ చూద్దాం..



**యోగాసనం ప్రయోజనాలు:**

ఈ యోగాసనం క్రమం తప్పకుండా చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయి:

1. మెటబాలిజం మెరుగుదల: శరీర జీవక్రియను వేగవంతం చేస్తుంది, తద్వారా కేలరీలు సమర్థవంతంగా బర్న్ అవుతాయి.
2. జీర్ణక్రియ బలోపేతం: జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. ఆహారం సరిగా జీర్ణమై పోషకాలు గ్రహించబడతాయి.
3. కొవ్వు తగ్గింపు: శరీరంలో పేరుకుపోయిన అదనపు కొవ్వు, ముఖ్యంగా పొట్ట, నడుము, తొడల భాగాల్లో పేరుకున్న ఫ్యాట్ క్రమంగా తగ్గేందుకు సహాయపడుతుంది.
4. కండరాల బలోపేతం: రెక్టస్ అబ్డామినస్, ఎక్స్టర్నల్, ఇంటర్నల్ ఆబ్లిక్ మజల్స్, ట్రాన్స్వర్స్ అబ్డామినస్ మజల్ వంటి కోర్ కండరాలను బలోపేతం చేస్తుంది. ఇది పొట్టకు బిగుతును అందిస్తుంది.
5. ఆరోగ్యం, అందం: పొట్ట భాగం బిగుతుగా మారడం వల్ల లూజ్ నెస్ తగ్గి, ఆరోగ్యంగా ఉండటమే కాకుండా, శరీరాకృతి మెరుగుపడుతుంది.



**యోగాసనం చేసే విధానం:**

ఈ యోగాసనం చాలా సులభం, ఇంట్లోనే సురక్షితంగా చేయవచ్చు.

1. ప్రారంభ స్థానం: మొదట వెల్లకిలా పడుకోండి. మీ రెండు కాళ్ళను మడిచి, పాదాలను మీ పిరుదుల దగ్గర సమాంతరంగా ఉంచండి. మెడను మధ్యలో ఉంచి, గడ్డం ఛాతీ వైపుకు ఆనించండి. మీ రెండు చేతులను పైకి నిటారుగా చాపండి.
2. పొట్ట శ్వాస: మీ పొట్ట భాగాన్ని అనుభూతి చెందండి. నిదానంగా ఊపిరి పీలుస్తూ, మీ పొట్ట భాగాన్ని వికసింపజేయండి (పైకి తీసుకురండి). ఊపిరి వదులుతూ, మీ పొట్ట భాగాన్ని లోపలికి లాగండి. ఊపిరి వదులుతూ పొట్టను ఎంత లోపలికి లాగితే అంత మంచిది. ఇది అబ్డామినల్ కేవిటీని విస్తరించి, సంకోచింపజేస్తుంది.
3. ఆసన క్రియ: ఇప్పుడు, ఊపిరి పీలుస్తూ, మీ చేతులు, మెడ, పై వెన్నుపూస భాగాన్ని మ్యాట్ నుండి పైకి లేపండి. ఈ స్థితిలో నాలుగు సెకన్ల పాటు శ్వాసను లోపలే పట్టుకొని ఉండండి. మీ చేతులు మోకాళ్ళ దగ్గరికి రావాలి. మెడ, భుజ కండరాలు, వెన్నుముక పై భాగము మ్యాట్ నుంచి మీదకు లేవాలి.
4. తిరిగి రావడం: నాలుగు సెకన్ల తర్వాత, నిదానంగా ఊపిరి వదులుతూ తిరిగి వెనుకకు పడుకోండి. మెడ భాగంలో ఎటువంటి జర్క్ రాకుండా జాగ్రత్త పడాలి. నెమ్మదిగా, నియంత్రిత కదలికతో పైకి లేచి, తిరిగి కిందకు రావాలి.
5. మళ్లీ ట్రై చేయండి: ఈ కదలికలను 10 నుండి 15 సార్లు అదే విధంగా చేయండి.
6. చివరగా : ఆసనం పూర్తయిన తర్వాత, నిదానంగా కుడి వైపుకు తిరిగి, కూర్చుని విశ్రాంతి తీసుకోండి. దీనివల్ల జీర్ణాంగాలు సహా మంచి మూమెంట్ పొందుతాయి.

ఈ సులభమైన యోగాసనం ద్వారా మీ పొట్ట కండరాలకు బలం చేకూరుతుంది. కోర్ మజల్స్ బలోపేతం కావడంతో పాటు, రెక్టస్ అబ్డామినస్ మజల్ కు మంచి బిగుత్వం వస్తుంది. దీనివల్ల పొట్ట భాగంలో వదులుతనం తగ్గి, ఆరోగ్యంతో పాటు అందం కూడా మెరుగుపడుతుంది. క్రమం తప్పకుండా సాధన చేయడం ద్వారా ఉత్తమ ఫలితాలను పొందవచ్చు



# అడోబ్ సీఈఓ పదవి నుంచి వైదొలగనున్న శంతను నారాయణ్




అమెరికాకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్‌లో నాయకత్వ మార్పు జరగనుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కొనసాగుతోన్న శంతను నారాయణ్ ఆ పదవి నుంచి దిగిపోనున్నారు. ఈ మేరకు కంపెనీ (యూఎశీఎవ) తాజాగా ఓ ప్రకటన చేసింది. తదుపరి సీఈఓ ఎంపిక పూర్తయిన తర్వాత శంతను ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు పేర్కొంది. అయితే, బోర్డు ఛైర్మన్‌గా ఆయన కొనసాగుతారని తెలిపింది.

అయితే, ఈ మార్పునకు గల కారణాన్ని మాత్రం కంపెనీ గానీ.. శంతను నారాయణ్ గానీ వెల్లడించలేదు. "సీఈవో బాధ్యతల నుంచి మారాలనుకుంటున్న నా నిర్ణయాన్ని బోర్డుకు తెలియజేశాను. దానికి బోర్డు అంగీకరించింది. ఇది గుడ్‌బై ఎంతమాత్రం కాదు. బోర్డు ఛైర్మన్‌గా కంపెనీ కోసం శ్రమిస్తూనే ఉంటా" అని ఉద్యోగులకు రాసిన మెయిల్‌లో శంతను పేర్కొన్నారు. మరోవైపు, అడోబ్ తదుపరి సీఈఓ ఎంపిక కోసం బోర్డు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది.

**అమెరికా తయారీకి చేటు చేస్తున్నాయా?**

భారత్‌కు చెందిన 62 ఏళ్ల శంతను నారాయణ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఎంబీఏ చదివారు. తొలుత సిలికాన్ గ్రాఫిక్స్, యాపిల్‌లో కొంతకాలం పనిచేసిన ఆయన.. 1998లో అడోబ్‌లో జనరల్ మేనేజర్‌గా చేశారు. 2007లో కంపెనీ సీఈఓగా బాధ్యతలు అందుకున్నారు. ఆయన నాయకత్వంలో కంపెనీ రికార్డు రెవెన్యూను సాధించింది. క్రియేటివ్, డిజిటల్ మీడియా సాఫ్ట్‌వేర్‌లో ప్రత్యేక స్థానం సాధించింది. బిజినెస్ రంగంలో శంతను అందించిన సేవలకు గానూ.. భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

# బేర్‌మన్న సూచీలు..

## ఇన్వెస్టర్ల జేబులకు మరో 10లక్షల కోట్లు చిల్లు






ముంబయి: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మరోసారి భారీ నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు, చమురు ధరలు పెరుగుదల, ఎఫ్‌ఐఐల విక్రయాలు వంటివి సూచీలపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో సూచీలు వరుసగా మూడోరోజూ భారీ నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ ఓ దశలో 1500 పాయింట్లు నష్టపోయింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.10 లక్షల కోట్లు క్షీణించి రూ.429 లక్షల కోట్లకు చేరింది.

అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 75,444.22 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,034.42) నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల ఒరవడి కొనసాగింది. ఇంట్రాడేలో 74,454.60 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1470.50 పాయింట్ల నష్టంతో 74,563.92 వద్ద ముగిసింది. నిఫ్టీ 488 పాయింట్ల నష్టంతో 23,151 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 92.45గా ఉంది.

సెన్సెక్స్ 30 సూచీలో హిందుస్థాన్ యూనిలీవర్, భారతీ ఎయిర్‌టెల్ మినహా మిగిలిన అన్ని స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. ఎల్‌అండ్‌టీ, టాటా స్టీల్, ఎస్‌బీఐ, బీఈఎల్, మారుతీ సుజుకీ స్టాక్స్ ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100.61 డాలర్ల వద్ద కొనసాగుతుం డగా.. బంగారం ఔన్సు 5091 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవే..**

పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు కొనసాగుతున్నాయి. ఖమేనీ మరణంతో ఎంతోకాలం కొనసాగదనుకున్న ఈ పోరు.. ప్రాంతీయ యుద్ధంగా విస్తరించడమే కాకుండా రెండు వారాలు కూడా పూర్తి చేసుకుంటుండడం ప్రతికూల ప్రభావం చూపింది. తగ్గినట్లే తగ్గిన చమురు ధర మళ్లీ 100 డాలర్ల మార్కును దాటింది. చమురు రవాణాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ప్రత్యర్థులపై 'ఒత్తిడి తెచ్చే సాధనం'గా మొజ్తాబా పేర్కొన్నారు. యుద్ధం ముగిసే వరకు దీని మూసివేత కొనసాగుతుందని ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ పేర్కొనడంతో చమురు ధరలు మళ్లీ భగ్గుమన్నాయి. చమురు ధరలు పెరగడం మన రూపాయి విలువపై ప్రతికూల ప్రభావం చూపుతోంది. దిగుమతుల బిల్లు పెరగడంతో రూపాయిపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో రూపాయి ఆల్‌టైమ్ కనిష్ఠానికి చేరింది.

మరోవైపు అమెరికాలో రెండేళ్ల కాలవ్యవధి కలిగిన బాండ్లపై రాబడులు ఆరు నెలల గరిష్ఠ స్థాయికి చేరాయి. 10 ఏళ్ల బాండ్ ఈల్డ్ కూడా భారీగా పెరిగాయి. అమెరికాలో బాండ్లపై రాబడులు పెరిగితే మనలాంటి వర్ధమాన దేశాల స్టాక్ మార్కెట్‌లకు నిధుల ప్రవాహం తగ్గుతుంది. దేశీయంగా ఎఫ్‌ఐఐల అమ్మకాలు కొనసాగుతున్నాయి. వరుసగా 10 రోజైన గురువారం కూడా రూ.7050 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను విక్రయించడం ప్రతికూల ప్రభావం చూపింది. గడిచిన 10 ట్రేడింగ్ సెషన్లలో రూ.57వేల కోట్ల షేర్లను ఎఫ్‌ఐఐలు విక్రయించడం గమనార్హం.

## గణేష్ పంచశీల ఎంక్లేవ్‌లో స్పోర్టరీ బ్యాడ్మింటన్ అకాడమీ



**అల్వాల్, మార్చి 13(నినాదం):** అల్వాల్ సర్కిల్ మచ్చ బొల్లారం డివిజన్ గణేష్ పంచశీల ఎంక్లేవ్ రోడ్ నంబర్ 2 లో స్పోర్టరీ బ్యాడ్మింటన్ అరేనా అకాడమీ ని మచ్చ బొల్లారం డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజ్ జితేంద్ర నాథ్, మరియు ఆర్టిస్ట్ ప్రభాస్ శ్రీను, మాజీ ఎమ్మెల్సీ సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ క్రీడలు శారీరక సామర్థ్యాన్ని, నైపుణ్యాన్ని పెంచే పోటీ తత్వంతో కూడిన శారీరక శ్రమ. మానసిక ఉల్లాసాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని, ఆత్మవిశ్వాసాన్ని మెరుగుపరుస్తాయని ,ఆయన తెలియపరిచారు. బ్యాడ్మింటన్ అకాడమీ పరిసర ప్రాంతాల వారికి ఎంతో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ప్రీతం రావు, చరణ్ రావు, కోచ్ వాసు మరియు కాంగ్రెస్ నాయకులు నిమ్మ అశోక్ రెడ్డి,రామ్ మోహన్ రావు, బొబ్బిలి సురేందర్ రెడ్డి, లడ్డు,శ్రీశైలం యాదవ్, నాగేశ్వరరావు,కొండల్ రెడ్డి,కేబుల్ శేఖర్,సంపత్ యాదవ్,దిడ్ల స్వామి, వెంకటేష్,

## ఘనంగా హరికిరణ్ పటేల్ జన్మదిన వేడుకలు

### జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కొలను హనుమంత రెడ్డి



**కుత్బుల్లాపూర్, మార్చి 13 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సుభాష్ నగర్ డివిజన్ సాయి బాబా నగర్ కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు హరి కిరణ్ పటేల్ జన్మదిన వేడుకలు ఆయన కుటుంబ సభ్యులు ఆత్మీయులు అభిమానులు కాంగ్రెస్ పార్టీ స్థానిక ముఖ్య నేతల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. హరి కిరణ్ పటేల్ పుట్టిన రోజు సందర్బంగా నిర్వహించిన వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి హాజరై హరికిరణ్ పటేల్ కు శాలువా కప్పి, కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని హరి కిరణ్ పటేల్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ మిఠాయిలు పంచుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యున్నతికి నిరంతరం పాటుపడుతూ స్థానిక ప్రజల సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుండే నాయకుడు హరికిరణ్ పటేల్ నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో జీవిస్తూ, కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాలతో ఉన్నత పదవులు అధిరోహించాలని, మరి ఎన్నో జన్మదిన వేడుకలను ప్రజల మధ్య ఆడంబరంగా జరుపుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## సిద్దులూర్‌లో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక



**వికారాబాద్, మార్చి 13(నినాదం):** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వికారాబాద్ జడ్పి సీఈ వో ఎం సుదీర్ శుక్రవారం జిల్లా పరిధిలోని సిద్దులూర్ లో కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ, పశు వైద్యశాల, వైద్య శాలను, పాఠశాల లను సందర్శించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనం చేశారు. గ్రామాభివృద్ధిపై ఆరాదిశారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు తీరును ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆశావర్కర్లకు కనీస వేతనం రూ:18 వేలు నిర్ణయించాలి

### ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డికి ఆశావర్కర్ల వినతి





**మల్కాజిగిరి, అల్వాల్ మార్చి13 (నినాదం):** అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలలో ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ. 18 వేలను నిర్ణయించాలని, అసెంబ్లీలో ఆశ వర్కర్ల సమస్యలపై చర్చ పెట్టాలని కోరుతూ తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాయకులు, ఆశా వర్కర్స్ ల ఆధ్వర్యంలో బోయిన్పల్లి లోని ఎమ్మెల్యే కార్యాలయంలో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కే ఉన్నికృష్ణ, తెలంగాణ ఆశా వర్కర్స్ ఉ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం రేవతి కళ్యాణి, ఉపాధ్యక్షురాలు కె కోమలత లు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం రూ. 18 వేల ను వెంటనే అమలు చేయాలని, ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రకటించాలని, పేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఎన్ హెచ్ ఎం కు సరిపడా నిధులు కేటాయించాలని, పెండింగ్ లో ఉన్న జనవరి, ఫిబ్రవరి రెండు నెలల పారితోష్కాలను వెంటనే చెల్లించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలు నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికలు ఉన్నారని ఎమ్మెల్యే దృష్టికి దృష్టికి తీసుకెళ్లారు. కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందించారని, ఆశా కార్యకర్తల యొక్క సేవలను గుర్తించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ )ఆరోగ్య కార్యకర్తలను గ్లోబల్ లీడర్స్ గా అవార్డునందించిందని, అనేక సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలకు చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కనీసం పక్క రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ లో మాదిరిగా ఫిక్స్ వేతనం ఇప్పటివరకు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశలకు కనీస వేతనం 18 వేల రూపాయలు అమలు చేస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదన్నారు. 50 లక్షల ఇన్సూరెన్స్ మట్టి ఖర్చులు, రిటర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు ఇచ్చినప్పటికీ అవి హామీలుగానే మిగిలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆశాల సమస్యల గురించి అసెంబ్లీ లో చర్చిస్తామని భరోసా ఇచ్చారు.

# సత్వర వైద్య సేవలతో ఆర్టీసీ ఆసుపత్రికి కొత్త హంగులు





### అందుబాటులోకి అత్యాధునిక పోర్టబుల్ ఎక్స్‌రే సౌకర్యం

### పోర్టబుల్ ఎక్స రే మిషన్ ప్రారంభించిన కెనరా బ్యాంక్ జోనల్ హెడ్ గూడ లక్ష్మణ్, ఆసుపత్రి సూపరింటెండెంట్, సీఎంఓ ఎన్.శైలజ మూర్తి



**కుత్బుల్లాపూర్, మార్చి 13 (నినాదం):** తెలంగాణ ఆర్టీసీ వీసీ, ఎండీ వై నాగిరెడ్డి ప్రత్యేక చొరవతో తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రి వైద్య సేవల్లో మరో ముందడుగు పడింది. సామాజిక బాధ్యతలో భాగంగా కెనరా బ్యాంక్ అనుబంధ సంస్థ 'క్యాన్ ఫిన్ హోమ్స్' వారు రూ. 20 లక్షల విలువైన అత్యాధునిక 'మొబైల్ డిజిటల్ పోర్టబుల్ ఎక్సరే' మిషన్‌ను ఆసుపత్రికి విరాళంగా అందజేశారు. ఈ నూతన యంత్రాన్ని కెనరా బ్యాంక్ తెలంగాణ జోనల్ హెడ్ గూడ లక్ష్మణ్, ఆసుపత్రి సూపరింటెండెంట్, సిఎమ్ఓ ఎన్.శైలజ మూర్తి శుక్రవారం రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్, సీఎంఓ శైలజ మూర్తి మాట్లాడుతూ సమాజ సేవలో భాగంగా బ్యాంకింగ్ సంస్థలు ముందుకు వచ్చి తమవంతు సహాయం అందించడం అభినందనీయమని కొనియాడారు. ఈ మొబైల్ డిజిటల్ పోర్టబుల్ ఎక్సరే మిషన్ అందుబాటులోకి రావడంతో వార్డుల్లో ఉన్న పేషంట్ల వద్దకే నేరుగా వెళ్లి ఎక్సరే తీసే అవకాశం ఉంటుందని, దీనివల్ల రోగులకు మరింత సత్వర, మెరుగైన వైద్య సేవలు అందుతాయని ఆమె వివరించారు. కెనరా బ్యాంక్ తెలంగాణ జోనల్ హెడ్ గూడ లక్ష్మణ్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో వీసీ, ఎండీ నాగిరెడ్డి నేతృత్వంలో తార్నాక ఆసుపత్రి సూపరింటెండెంట్, సిబ్బంది చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో కెనరా బ్యాంక్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ అడ్మినిస్ట్రేటర్ పి. శ్రీనివాస్, కెనరా బ్యాంక్ మేనేజర్లు టి.టి. అచ్యుతానందం, అశోక్ గౌతమ్, పలువురు వైద్యులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

## గ్యాస్ కొరత లేదు : కలెక్టర్ నారాయణరెడ్డి



**రంగారెడ్డి బ్యూరో, మార్చి 13 (నినాదం) :** రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని, జిల్లాలో ఎల్.పి.జి గ్యాస్ కొరత లేదని జిల్లా ప్రజలు ఆందోళన చెందవద్దని, వందతులను నమ్మవద్దని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా-ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో చమురు, ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని, ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడనుందని వస్తున్న వార్తలను ప్రజలు నమ్మవద్దని, యుద్ధం ప్రభావం వలన జిల్లాలో ఎలాంటి ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని, ఇంతకు ముందు గ్యాస్ బుక్ చేసుకున్నా తరువాత సరఫరా ఉన్నట్లే ప్రస్తుతం కూడా అదే విధంగా గ్యాస్ సరఫరా ఉంటుందని, ఎలాంటి జాప్యం ఉండదని, జిల్లాలో సరిపడా గ్యాస్ నిల్వలు ఉన్నాయని, గృహ అవసరాలకు వినియోగించే ఎల్.పి.జి గ్యాస్ కు ఎలాంటి కొరత లేదని, అదేవిధంగా ఆసుపత్రులు, విద్యాసంస్థలకు చెందిన వసతి గృహాలు, అనాధ శరణాలయాలు, వృద్ధాశ్రమాలు వంటి సంస్థలకు ఎలాంటి కొరత లేదని తెలుపుతూ, జిల్లా ప్రజలు గ్యాస్ పై వస్తున్న అవాస్తవాలను, వదంతులను నమ్మి ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శుక్రవారం ఆ ప్రకటనలో తెలిపారు.

## ఈద్ కా తోఫా రంజాన్ పండుగ కిట్లు పంపిణీ



**కుత్బుల్లాపూర్, మార్చి 13 నినాదం):** రంజాన్ పండుగ వేడుకల సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ముస్లిం సోదరులకు తోడ్పాటు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న "ఈద్ కా తోఫా" (రంజాన్ కానుక) పథకం పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి, బహదూర్ పల్లి మసీదులల్లో నిర్వహించిన కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మసీదుల ద్వారా అర్హులైన ముస్లిం కుటుంబాలకు ఈద్ కా తోఫాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొలను హనుమంత రెడ్డి మాట్లాడుతూ, రంజాన్ పండుగ సోదరభావం, సహనం, సేవా భావానికి ప్రతీక అన్నారు. అర్హత కలిగిన ముస్లిం కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఈద్ కా తోఫా పథకం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి అధ్యక్షులు బైరి ప్రశాంత్ గౌడ్, లేబర్ సెల్ అధ్యక్షులు సుదర్శన్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, మాజీ ఉపసర్పంచ్ గోపాల్ రెడ్డి, ఆదిరెడ్డి మోహన్ రెడ్డి, షైక్ ఇబ్రహీం, పూర్ణచందర్ రావు, జయభేరి గోపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, అంజి ముదిరాజ్, కుంట శ్రీనివాస్, మజీద్ కమిటీ అధ్యక్షులు మహ్మద్, సభ్యులు షైక్ ఖాదీర్, సలీం, మైబలి, జహంగీర్, దస్తగిరి పాల్గొన్నారు.

# గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని నిరసన



**మల్కాజిగిరి, మార్చి 13 (నినాదం):** ప్రజలకు మేలు చేసి, ప్రజల యొక్క దీవెనలు పొందాలనుకుంటే వెంటనే కేంద్ర ప్రభుత్వం పెంచినటువంటి గ్యాస్ ధరలను వెనక్కి తీసుకోవాలని, ఇటువంటి వంట వస్తువులపై ధరలు పెంచకుడదని, గళ్ళ పెంచడం వల్ల ప్రయాణికం మొత్తం కూడా అయోమయ పరిస్థితిలో పడిపోతుందని, ఆర్థిక పరిస్థితులు చిన్నాభిన్నమైపోతాయని, వెంటనే పెంచిన గ్యాస్ ధరలను కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి గ్యాస్ ధరలను తగ్గించే విధంగా చర్యలు తీసుకోవాలని ఐద్వా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాయకురాలు లీలావతి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని కోరుతూ శుక్రవారం మౌలాలి డివిజన్ పరిధిలోని శ్రామిక నగర్ లో ఐద్వా (మహిళా సంఘం) ఆధ్వర్యంలో రోడ్డుపై కట్టెల పొయ్యిని ముట్టించి వంట చేస్తూ నిరసన కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా మౌలాలి డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్ శోభ, సిహెచ్ జ్యోతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజే ఇదేదో మహిళలకు బహుమతిగా ఇచ్చినట్టు వాళ్ల నెత్తిమీద ఇంకా భారం మోపుతూ గ్యాస్ ధరను అమాంతంగా పెంచేసిందని, దీనితో వంట గ్యాస్ చాలా ఖరీదు పెరిగిపోయి, సామాన్య ప్రజానీకానికి కూడా ఇబ్బందికరమైన పరిస్థితి ఏర్పడిందని, అటు టిఫిన్ సెంటర్లు, హోటల్స్ కి, ఇళ్లల్లో గ్యాస్ ధర పెరిగిపోవడం దానితో హడా వుడిగా గ్యాస్ కొంతమందికి బ్లాక్ లో పంపిణీ చేయడం జరిగిందని, అసలు గ్యాస్ వంటకి గ్యాస్ దొరికే పరిస్థితి లేకుండా పోయిందని, ఒక పక్కన మేలు చేస్తానంటూ ప్రజలకు మరో ప్రక్క నుండి కీడు చేసే కార్యక్రమాలు కేంద్ర ప్రభుత్వం బిజెపి చేపడుతున్నటువంటి విధానాలను వ్యతిరేకించారు. ఇక వెనకటి రోజుల్లోకి వెళ్లిపోవడం ఏనా అలాంటప్పుడు గ్యాస్ ని ఎందుకు ప్రవేశపెట్టారు అంటూ దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఉపేంద్ర, భాగ్య, లక్ష్మి, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా చైతన్య సదస్సు





### చైతన్యం ద్వారానే మోసాలను అరికట్టవచ్చు

### డీఎస్ఓ తనుషా

**దుబ్బాక, మార్చి 13 (నినాదం):** ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సివిల్ సప్లైస్ విభాగం ఆధ్వర్యంలో వినియోగదారుల చైతన్య సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సరఫరాల అధికారి (డీఎస్ఓ) తనుషా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్లో విక్రయించే ఉత్పత్తుల భద్రత, నాణ్యత ప్రమాణాలపై వినియోగదారులకు పూర్తి అవగాహన ఉండాలని సూచించారు. వినియోగదారులు కొనుగోలు చేసే ప్రతి వస్తువుపై తయారీ తేదీ, గడువు తేదీ (ఎక్స్‌పైరీ డేట్) తప్పనిసరిగా పరిశీలించాలని తెలిపారు. చైతన్యం ద్వారానే మోసాలను అరికట్టవచ్చని పేర్కొన్నారు. వినియోగదారులు చెల్లించిన ప్రతి రూపాయికి సరైన ప్రతిఫలం పొందే హక్కు ఉన్నప్పటికీ అనేక సందర్భాల్లో వారు నష్టపోతున్నారని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కన్స్యూమర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కుంభాల రవీందర్, జిల్లా జనరల్ సెక్రటరీ గుర్రాల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజలు సరుకులు కొనుగోలు చేస్తూ పన్నులు చెల్లిస్తున్నప్పటికీ కొన్నిసార్లు సరైన సేవలు అందడం లేదని తెలిపారు. ముఖ్యంగా ఆహార పదార్థాల్లో కల్తీ సమస్య పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలు, నూనె, నెయ్యి వంటి నిత్యావసర వస్తువుల నుంచి విలాస వస్తువుల వరకు అనేక ఉత్పత్తుల్లో కల్తీ జరుగుతోందని తెలిపారు. మిఠాయి దుకాణాలు, హోటళ్లు, రెస్టారెంట్లు, ధాబాల్లో నాసిరకం నూనెలు, రసాయనాలు, రంగులు వాడుతున్నట్లు గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. ఫ్రిజ్‌లలో ఎక్కువకాలం నిల్వ ఉంచిన మాంసం, చేపలు, చికెన్‌ను వినియోగించడం ఆరోగ్యానికి హానికరమని హెచ్చరించారు. తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఆసుపత్రుల్లో కూడా కొన్నిసార్లు అవసరం లేని పరీక్షలు సూచించడం వల్ల వినియోగదారులకు ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం, న్యాయస్థానాలు జనరిక్ మందులు వాడాలని సూచించినప్పటికీ కొంతమంది వైద్యులు కమిషన్ల కోసం బ్రాండెడ్ మందులు వ్రాస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో తూనికలు-కొలతల అధికారి శివరంజని, డ్రాక్కు ఇన్స్పెక్టర్ సుస్మి, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ జయరాం, సివిల్ సప్లై అధికారులు శ్రీనాథ్, శ్రీలత, కన్స్యూమర్ అసోసియేషన్ ప్రతినిధులు అస పెద్ద ముత్యం, నెల్లుట్ల నరసవ్వ, సంధిరెడ్డి శంకరవ్వ, శోభ, సునీత, వెంకట్ లక్ష్మి, హెచ్‌పి డీలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు సతీష్, డీలర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, జై ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# హెచ్‌పి గ్యాస్ సెంటర్, ఫర్టిలైజర్, రేషన్ షాపులను సందర్శించిన కలెక్టర్





**వికారాబాద్, మార్చి (నినాదం):** జిల్లాలో గృహ వినియోగ ఎచ్ పి గ్యాస్ సరఫరా విధానం సక్రమంగా జరగాలనిజిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శుక్రవారం వికారాబాద్ పట్టణంలోని హెచ్‌పీ గ్యాస్ సెంటర్‌ను, ఫర్టిలైజర్ దుకాణాలను, రేషన్ షాపులను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా గ్యాస్ సిలిండర్ల నిల్వలు, పంపిణీ విధానం, బుకింగ్ ప్రక్రియ మరియు వినియోగదారులకు సకాలంలో గ్యాస్ సరఫరా జరుగుతున్నదా అనే అంశాలను కలెక్టర్ పరిశీలించారు. గ్యాస్ బుకింగ్ నుండి డెలివరీ వరకు నిర్వహిస్తున్న రికార్డులను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్యాస్ సెంటర్‌లో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నారా, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఏర్పాట్లు ఉన్నాయా అనే అంశాలను కూడా పరిశీలించారు. వినియోగ దారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గ్యాస్ సిలిండర్ల సరఫరా చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ పారదర్శకంగా సేవలు అందించాలని, ఎలాంటి అక్రమాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హెచ్చరించారు. అదే విధంగా ఫర్టిలైజర్ దుకాణాల్లో నిర్దేశించిన ధరలకు రైతులకు అందించాలని అన్నారు. రేషన్ దుకాణాల్లో నిబంధనలను కచ్చితంగా పాటించాలని అన్నారు. ఏలాంటి పొరపాట్లను ఉపేక్షించేది లేదని అన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డి ఎం సి ఎస్ మురళి కృష్ణ, డి ఎస్ ఓ సుదర్శన్, సంబంధిత శాఖ అధికారులు మరియు గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

### సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే వినతి



**కూకట్‌పల్లి, మార్చి 13 (నినాదం) :** కూకట్ పల్లి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ జి.సృజనను కలిసి విన్నవించారు. నియోజకవర్గం లో పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని, కూకట్ పల్లి నల్ల చెరువు ప్రజలకు ఉపయోగపడేలా అభివృద్ధి చేయడం జరిగింది కానీ చెరువు దగ్గర పలు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయవలసిన అవసరం ఉందన్నారు. మహిళలకు పురుషులకు చిన్న పిల్లల పార్కు ఆట పరికరాలు వాకింగ్ ట్రాక్ యోగ ఇండోర్ స్టేడియం పార్కులో 30 బెంచీలు లైబ్రరీ మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. రామారావు నగర్ నాలా పనులు చేపట్టడం జరిగింది ఇట్టి నాలాపై సుమారుగా 500 ఫీట్లు పనిచేయవలసిందే కావున నాలాపై స్లాబ్ ఏర్పాటుకి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాల్సిందిగా కోరారు. మూసాపేట చౌరస్తా నుండి ఆంజనేయ నగర్ వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని, బాలనగర్ గత కొన్ని సంవత్సరాలుగా పేద ప్రజలకు ఉపయోగపడుతున్న రాజు కాలనీ కమ్యూనిటీ హాలు ఈఎస్ఐ డిస్పెన్సరీగా కేటాయిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైనది కాదన్నారు. స్థానిక పేదల అవసరాల కోసం నిర్మించిన కమ్యూనిటీ హాలు ను ఈఎస్ఐ కి అప్పగించారు అన్న నిర్ణయాన్ని ఎట్టి పరిస్థితుల్లో సహించబోమని తెలిపారు. ప్రజలకు ఉపయోగపడే కమ్యూనిటీ హాల్ ను యధావిధిగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం మాజీ కార్పొరేటర్లు ఆవుల రవీందర్ రెడ్డి, తూము శ్రావణ్ కుమార్, పగడాల బాబురావు, పండాల సతీష్, మందాడి శ్రీనివాస రావు , సబిహా గౌసుద్దీన్, మాధవరం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

# అసంపూర్తిగా నిలిచిన కమ్యూనిటీ హాల్ పనులు

- స్థానికులతో కలిసి పనులు పరిశీలించిన పుప్పాల భాస్కర్



**కుత్బుల్లాపూర్, మార్చి 13 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సూరారం డివిజన్ శ్రీకృష్ణ నగర్‌లో అసంపూర్తిగా నిలిచిపోయిన కమ్యూనిటీ భవనం పనులను డివిజన్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ స్థానికులతో కలిసి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద ప్రభుత్వ నిధులు మంజూరు చేసి ఈ కమ్యూనిటీ భవనం నిర్మాణాన్ని ప్రారంభించారని, ప్రస్తుతం నిధుల కొరత కారణంగా పనులు మధ్యలోనే నిలిచిపోయాయని స్థానికులు వివరించారు. గతంలో ఇదే కమ్యూనిటీ హాల్‌లో బస్తీ వాసుల సౌకర్యార్థం బస్తీ దవాఖాన నిర్వహించబడుతూ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేవని ప్రస్తుతం నిర్మాణ పనుల కారణంగా బస్తీ దవాఖానను వేరే ప్రాంతానికి మార్చాల్సి వచ్చిందని స్థానికులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అనంతరం బస్తీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు, వీధుల వెంట వెలిగాల్సిన విద్యుత్ దీపాల సమస్యలపై పుప్పాల భాస్కర్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. వాటర్ వర్క్స్ మేనేజర్ ఈశ్వరయ్యతో కలిసి నీటి సమస్యలు ఉన్న గల్లీలను పరిశీలించి డ్రైనేజీ సమస్యను త్వరగా పరిష్కరించాలని సూచించారు. రెండు రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలిపోయిన విద్యుత్ దీపాలను తక్షణమే మార్చాలని జిహెచ్ఎంసి అధికారులకు ఫోన్ ద్వారా వివరించారు. ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించుటకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ స్థానిక ప్రజలకు భరోసా ఇచ్చారు.

## పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎస్ఎస్ అమలు : ఎస్పీ స్నేహ మెహ్రా



**వికారాబాద్, మార్చి 13(నినాదం):** జిల్లాలో మార్చి నేటి నుండి ఏప్రిల్ 16 వరకు నిర్వహించబడనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ తరపున కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నట్లు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఐ పి ఎస్ తెలిపారు. పరీక్షలు జరిగే రోజుల్లో ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జిల్లాలోని మొత్తం 69 పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 163 బన్స్ బిఎన్ఎస్ఎస్ పాత సెక్షన్ 144 సిఆర్‌పిసి అమలులో ఉంటుందని ఎస్పీ వెల్లడించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురికి మించి గుంపులుగా చేరడం నిషేధం. అలాగే పరీక్షా కేంద్రాల సమీపంలో ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు మైకులు, డిజేలతో ఊరేగింపులు నిర్వహించరాదని స్పష్టం చేశారు. పరీక్షల సమయంలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు కేంద్రాల సమీపంలోని ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు స్టేషనరీ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని సంబంధిత యజమానులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు.

## ఆరో వార్డు కౌన్సిలర్ బాకం సాయి కిరణ్ ఔదార్యం

**-పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పెన్నులు పెన్సిళ్లు అందజేత**



**సుల్తానాబాద్, మార్చి 13(నినాదం):** శనివారం నుండి జరగనున్న పదవ తరగతి పరీక్ష లలో ఆరవ వార్డు లోని పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు 6వ వార్డు కౌన్సిలర్ బాకమ్ సాయి కిరణ్ శుక్రవారం దాదాపు 30 మందికి పరీక్ష ప్యా డులు పెన్నులు పెన్సిళ్లు అందజేసి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ సాయికిరణ్ మాట్లాడుతూ, పదవ తరగ తిలో విద్యార్థిని విద్యార్థులు ప్రతిభ కనబరచాల ని ప్రతి ఒక్కరు మొదటి ర్యాంకులో ఉత్తీర్ణత సా ధించాలని కోరారు. విద్యార్థిని విద్యార్థులకు తన సహాయ సహకారాలు ఎప్పటికీ ఉంటాయని సా యికిరణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దేవేం దర్ కుమార్, ఆరెపల్లి కిరణ్, సోహన్ రాజు, మా మిడిపల్లి శ్రీకాంత్ ,వెంకటేష్ తదితరులు పాల్గొ న్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక





**మంథని మార్చి 13 (నినాదం):** తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. మంథని పట్టణం ప్రభుత్వ ఉన్నత పాఠ శాలలో మంథని డివిజన్ ఇన్చార్జి బోనాల రవీం దర్ అధ్యక్షతన సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశం లో మండల అధ్యక్షుడిగా బొబ్బ ల ఉమాపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంకరయ్య, కోశాధికారిగా మంథని రాజశేఖర్, ఉపాధ్యక్షులుగా ఆలే రవీందర్, అఖిల్, శ్రీనివాస్, శ్రీవాణి, కార్యదర్శులుగా శ్రీధర్, రమేష్, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, వివిఎన్ రాణి, ఎన్నికయ్యారు. ఎన్నికైన వారందరూ ప్రమాణస్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ముసుకుల సునీల్ రెడ్డి పాల్గొన్నారు. నూతనంగా ఏర్పాటు అయిన కార్యవర్గం మాట్లాడుతూ జిల్లా ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

### "బండి" కొండగట్టు

## మహాయాత్రను జయప్రదం చేయాలి

**-బిజెపి శ్రేణులు కడారి అశోక్ రావు, నల్ల మనోహార్ రెడ్డి**



**సుల్తానాబాద్, మార్చి 13(నినాదం):** కేంద్ర హోం సహాయ మంత్రి బండి సంజయ్ కు మార్ కొండగట్టు మహాయాత్రను బిజెపి కార్యక ర్తలు జయప్రదం చేయాలని జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, బిజెపి రాష్ట్ర నా యకుడు నల్ల మనోహార్ రెడ్డి పిలుపునిచ్చారు. క రీంనగర్ లోని మహాశక్తి ఆలయం నుండి కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కు మార్ ఆధ్వర్యంలో కొండగట్టు వరకు మహా పాద యాత్ర ప్రారంభించడం జరుగుతుందని వారు అ న్నారు. ఈ మహాయాత్రకు పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నుండి మున్సిపాలి టీ ల నుండి అధిక సంఖ్యలో బీజేపీ నాయకులు కార్యకర్తలు హిందూ బంధువులు పాల్గొని మహా పాదయాత్ర ను విజయ వంతం చేయాలని పె ద్దపల్లి బీజేపీ జిల్లా ప్రధాని కార్యదర్శి కడారి అశోక్ రావు బీజేపీ రాష్ట్ర నాయకులు నల్ల మనోహార్ రెడ్డి పిలుపునిచ్చారు.ఈ విలేఖరుల సమావేశం లో జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం జిల్లా ఉపాధ్యక్షులు శనిగరపు రమేష్ జిల్లా కార్యద ర్శిగ్రరెపెల్లి నారాయణ స్వామి కౌన్సిలర్ కందు నూరి సమత కుమార్ మాజీ సర్పంచ్ పల్లె ఓదెలు కొమ్ము తిరుపతి లంక శంకర్ నాగుల తిరుపతి పాల్గొన్నారు.

# గ్యాస్ కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత కేంద్రానిదే

**ప్రజలకు అందుబాటులో గ్యాస్ సిలిండర్లు ఉండేలా చూడాలి**

**గ్యాస్ డీలర్లు గ్యాస్ కొరత సృష్టిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు**

**తెలంగాణ ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**



**మంథని మార్చి 13 (నినాదం)** ప్రపంచంలో జరుగుతున్న యుద్ధం పరిణామాల దృష్ట్యా గ్యాస్ కొరత ఏర్పడిందని, గ్యాస్ కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే అని తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. శుక్రవారం మంథని పట్టణంలో పురపాలక సంఘ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా గ్యాస్ బండ సామాన్యుడికి గుడిబండల మారిందని తెలిపారు.యుద్ధ వాతావరణం ఏర్పడిన సందర్భంలో గ్యాస్ కొరత ఏర్పడిందని, సామాన్యుడికి గ్యాస్ అందేలా చర్యలు చేపట్టాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వాన్ని పేర్కొన్నారు. గ్యాస్ ఏజెన్సీ డీలర్లు గ్యాస్ సిలిండర్లను బ్లాక్ లో విక్రయించినట్లు తెలిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సామాన్యుడికి అందుబాటులో గ్యాస్ సిలిండర్లు ఉండేలా తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గ్యాస్ కొరత లేకుండా ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తుందని మంత్రి తెలిపారు. ఇప్పటికే గ్యాస్ నిలువల గురించి పౌరసరఫల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సంబంధిత అధికారులతో సమావేశం ఏర్పాటు చేశామని, సామాన్యుడికి అందుబాటులో సిలిండర్ ఉండేలా చర్యలు చేపడతామని ఆయన చెప్పారు. రాష్ట్రంలో గ్యాస్ విలువల గురించి ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వానికి వివరిస్తున్నట్లు మంత్రి వివరించారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో భారత ప్రధాని మోడీ గ్యాస్ సరఫరా గురించి తక్షణమే స్పందించాలని మంత్రి పేర్కొన్నారు. దేశంలో ప్రస్తుతం గ్యాస్ నిల్వలు ఎన్ని ఉన్నాయి, ఇంకా ఎన్ని రోజులకు సరిపడా ఉంటాయి అనే విషయం కేంద్ర ప్రభుత్వం ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ఉందని మంత్రి తెలిపారు. ముడి చమురు నిలువల గురించి కూడా కేంద్ర ప్రభుత్వం వివరిం చాలని రాష్ట్రానికి సంబంధించినటువంటి గ్యాస్ సరఫరా, ముడి చమురు సరఫరా గురించి కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు వివరాలు తెలుపుతున్నమనీ మంత్రి అన్నారు. రాష్ట్రానికి ఎలాంటి కొరత కలుగకుండా సరఫరా చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం అని వారన్నారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్ పర్సన్ వోడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, మండల పార్టీ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి సభ్యులు, న్యాయవాది శశిభూషణ్ కాచే, నాయకులు సేగం రాజేష్, మంథని సత్యం, సోషల్ మీడియా ఇన్చార్జి ఆరెళ్లి కిరణ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## "పది"కి పకడ్బందీ ఏర్పాట్లు...

**సుల్తానాబాద్, మార్చి 13(నినాదం):** పదవ తరగతి పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేశామని సుల్తానాబాద్ మండల విద్యాధికారి ఆరెపల్లి రాజయ్య స్పష్టం చేశారు. ఆయన ఎస్ఎస్సి పరీక్ష కేంద్రాలను సందర్శించి, ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలంలో 5 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.సుల్తానా బాద్ లో గవర్నమెంట్ హైస్కూల్, సెంట్ మేరీ హైస్కూల్,అల్ఫోర్స్ హైస్కూల్ తో పాటుగర్రెపల్లిలో టీఎస్ఎంఎస్,సాంఘిక సంక్షేమ (బాలికల) గురుకుల పాఠశాలలో సెంటర్లను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఈ సెంటర్లకు గవర్నమెం ట్ హై స్కూల్ సుల్తానాబాద్ ఎస్ రత్నాకర్ రెడ్డి -చీఫ్ సూపరింటెండెంట్, వి అంజయ్య డిపార్ట్మెం టల్ ఆఫీసర్,సెయింట్ మేరీస్ హై స్కూల్ లో వై రాధాస్వామి -చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వ ర్లు-డిపార్ట్మెంటల్ ఆఫీసర్,ఆల్ ఫోర్స్ హై స్కూల్ సెంటర్కు వి. కవిత చీఫ్ సూపరెంట్, వెంకటేశ్వ ర్లు-డిపార్ట్మెంటల్ ఆఫీసర్,టీఎంఎస్ గర్రెపల్లి సెంటర్ కు రవీందర్- చీఫ్ సూపరింటెండెంట్ ,బి రామకృష్ణ- డిపార్ట్మెంటల్ ఆఫీసర్,టీజీఎస్ డ బ్ల్యూఆర్ఐఎస్ గర్రెపల్లి సెంటర్కు డి శ్రీనివాసరెడ్డి -చీఫ్ సూపర్ ఇంటెండెంట్ ,డి సురేష్ -డిపార్ట్మెంటల్ ఆఫీసర్ నియమించామని, ఐదు సెంటర్లకు 54 మంది ఇన్విజి లెటర్స్ విధులు నిర్వహి స్తున్నారని అన్నారు. ఈ సెంటర్లో పరీక్ష రాసే విద్యార్థులు,బాలికలు 423, బాలురు 505, మొత్తం 928: మంది విద్యార్థులు పరీక్షలు హాజరు అవుతున్నారని,ఈ పరీక్ష సెంటర్లలో విద్యా ర్థులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఫర్నిచర్, తాగునీరు, టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ విషయాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి ఏర్పాట్లు చేయ డం జరిగిందని తెలియజేసినారు. పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులకు వైద్య సౌకర్యం కూడ ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు .



### ఒత్తిడి లేకుండా

## పదవ తరగతి పరీక్షలు రాయాలి

**-విద్యార్థులకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి శ్రీధర్ బాబు**



**మంథని మార్చి 13 (నినాదం):** పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలని తెలంగాణ ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు శుక్రవారం తెలిపారు. శనివారం పదోతరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభమవుతున్న సందర్భంగా విద్యార్థులు ఒత్తిడిని జయించి పరీక్షలు రాయాలని సూచించారు.అధికారులు పదో తరగతి పరీక్షలకు విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు జరిగాలని పేర్కొన్నారు. పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులందరికీ ముందస్తుగా మంత్రి శ్రీధర్ బాబు శుభాకాంక్షలు తెలిపారు.

## ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన

**లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జూపల్లి తిరుమలరావు లైన్స్ క్లబ్ వారికి కృతజ్ఞతలు తెలిపిన స్థానిక సర్పంచ్ సాయి కిరణ్**

**సుల్తానాబాద్, మార్చి 13(నినాదం):** సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ జూ పల్లి తిరుమల్ రావు ఆధ్వర్యంలో మండలంలోని అల్లిపూర్ గ్రామంలో స్థానిక సర్పంచ్ కోదాటి సా యికిరణ్ నిర్వ హించిన ఉచిత కంటి వైద్య శిబిరా నికి విశేష స్పందన లభించింది. సర్పంచ్ సాయి కిరణ్ కోరిక మేరకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తి రుమల్ రావు రేకుర్తి కంటి ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా 250 మందికి పైగా వైద్య పరీ క్షలు నిర్వహించు కున్నారు. అందులో 36 మం దిని రేకుర్తి ఆస్పత్రికి ఉచిత శాస్త్ర చికిత్స నిమిత్తం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనంలో తీ సుకెళ్లారు. లైన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుమల్ రావు మాట్లాడుతూ, కంటి సమస్యలతో ఏ ఒక్క నిరు పేద వ్యక్తి బాధపడకూడదని సదుద్దేశంతో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపా రు. గ్రామ సర్పంచ్ సాయి కిరణ్ మాట్లాడుతూ తమ గ్రా మంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తిరుమలరావుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ పా లకవర్గం తో పాటు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## పలు కుటుంబాలను పరామర్శించిన మంత్రి



**మంథని మార్చి 13 (నినాదం):** మంథని పట్టణంలోని పోచమ్మ వాడకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు పెరుగు సతీష్ ఇటీవల మరణించగా రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ వారి కుటుంబాన్ని శుక్రవారం పరర్శించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి ప్రగడ సానుభూతి తెలిపారు. అదే విధంగా గంగాపురి కి చెందిన బత్తుల సత్యనారాయణ ఇటీవల మరణించగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

### మాదకద్రవ్యాల వినియోగంతో

## జీవితాలు అంధకారం

**-డ్రగ్స్ నియంత్రణకు ప్రతిఒక్కరు సహకరించాలి**

**-పిల్లల భద్రత పై పోషకులు అప్రమత్తత అవసరం**

**-సైబర్ క్రైమ్స్, రోడ్ సేఫ్టీ రూల్స్ పై అవగాహన ఉండాలి**

**-పెద్దపల్లి డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ బి.రామ్ రెడ్డి**



**యైటింక్లయిన్ కాలనీ, మార్చి 13, (నినాదం):** మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతుందని, చెడు స్నేహం, చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ విద్యబుద్ధులతో ఉన్నతంగా ఎదగాలని పెద్దపల్లి డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ బి. రాంరెడ్డి అన్నారు. రామగుండం కమీషనరేట్ గోదావరిఖని ఏసీపీ మడత రమేష్ నేతృత్వంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భవానీ గార్డెన్స్ లో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైమ్, రోడ్ సేఫ్టీ రూల్స్ తదితర అంశాల పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఎస్.పి. నాయక్ మహారాజ్ (ప్రవచనకర్త)తో కలిసి అయన ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడారు. డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నదని అన్నారు. యువత చెడు స్నేహాలు, ప్రలోభాలకు లోనుకాకుండా తమ లక్ష్యాల పై దృష్టి పెట్టాలని సూచించారు. ఒక్కసారి డ్రగ్స్‌కు బానిస అయితే ఆరోగ్యం, చదువు, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటాయని పేర్కొన్నారు. డ్రగ్స్ సమస్య కేవలం వ్యక్తిగత సమస్య మాత్రమే కాదని సమాజానికి సైతం ప్రమాదకరమని పేర్కొన్నారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయం, వినియోగం చేస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి అని పిలుపునిచ్చారు. పిల్లల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలన్నారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, మంచి మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, ఓటీపీలు ఎవరితోనూ పంచుకోకూడదని హెచ్చరించారు. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలన్నారు. వాహనం నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం, మితిమీరిన వేగంతో వాహనం నడపకపోవడం, డ్రైవింగ్ సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించకపోవడం నియమాలు పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని 2 టౌన్ సిఐ ఎన్. ప్రసాదరావు, పోలీస్ స్టేషన్ సిబ్బంది సిహెచ్ రాజయ్య, ఎం కనకయ్య, ఎం.పూర్ణచందర్, రాజ్ కుమార్, దేవేందర్ రావు, ఎం.శ్రీలత, న్యాతరి శ్రీనివాస్, కళాబృందం సిబ్బంది, శాంతినికేతన్ స్కూల్, స్పందన స్కూల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు, మెప్మా మహిళా గ్రూప్స్ మరియు రిసోర్స్ పర్సన్స్, ఏఎన్ఎం లు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి దిశగా 1 వార్డు కౌన్సిలర్ ఈర్ల స్వరూప శేఖర్

**-వార్డు అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి**

**-గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా**





**సుల్తానాబాద్, మార్చి 13(నినాదం):** కొత్తగా ఎన్నికైన ఒకటవ వార్డు కౌన్సిలర్ ఈర్ల స్వ రూప శేఖర్ అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సా రించారు. తనను గెలిపించిన ప్రజల రుణం తీర్చు కుంటానని అన్నారు. రాజకీయమంటే వ్యాపారం కాదని ప్రజలకు అందు బాటులో ఉంటూ సేవ చే యాలనే సంకల్పంతో గెలిపించిన ప్రజల సమస్య లు ఎక్కడ ఉన్న అక్కడికి వెళ్లి పరిష్కారం చూపే దిశగా తన వంతు ప్రయత్నాలు చేస్తున్నాడు. అం దులో భాగంగానే నిండుకున్న డ్రైనేజీలను మున్సి పల్ సిబ్బందిచే శుభ్రం చేయించారు.అంతేకాకుం డా చీకటి పడితే రోడ్లపై నడవడానికి స్ట్రీట్ లైట్లు లే కపోవడంతో మున్సిపల్ సిబ్బందిచే లైట్లు అ మర్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ,1వ వార్డు ప్రజల రుణం తీర్చుకుంటానని సాధ్యమైనంత వరకు సేవ చేయడమే నా లక్ష్యమ ని అన్నారు. సమస్యల పరిష్కారానికి ము న్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. రాబోయే వేసవి కాలంలో త్రాగునీటి ఎద్దడి లేకుండా నివారించేందుకు చర్యలు చేపడతానని అన్నారు. భవిష్యత్తులో ఆదర్శవార్డుగా తయారు చేసి చూపిస్తానని అన్నారు.

## భగీరథ జలం.. దుర్గంధం

**-కలుషిత నీటితో కలవరం**



**మంచిర్యాల, మార్చి 13 (నినాదం) :** రాష్ట్రంలో మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి సురక్షిత తాగునీరు అందించాలనే లక్ష్యం నీరు కారుతుంది. స్వచ్ఛమైన తాగు నీరు కాస్త దుర్గంధంగా మారింది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 30 వ డివిజన్ లో ప్రజల గళం లో గరళం తిరుగుతుంది. అసలే వేసవి గుక్కడు నీటి కోసం నాన్న తిప్పలు పడుతుంటే నాలాలో సరఫరా అయ్యే నీరు కలుషితమైనది కావడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. శుద్ధిచేసిన గుక్కెడు మంచినీళ్ల కోసం ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. గత రెండు రోజులుగా మిషన్ భగీరథ నీరు రంగు మారి సరఫరా అవుతుందని ప్రజల ఆవేదన వ్యక్తం చేశారు. నల్లాల నుంచి మురుగనీరు సరఫరా అవుతున్నందున తాగునీటిని కొనుక్కుంటున్నామని ప్రజల ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు వంట పాత్రలు శుభ్రం చేయడానికి కానీ, స్నానాలకు పనికి రావడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి స్వేచ్ఛ జలాలు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### పది విద్యార్థులకు

## పరీక్ష ప్యాడ్లు అందజేత



**మంచిర్యాల, మార్చి 13(నినాదం):** పదవ తరగతి విద్యార్థులకు శనివారం నుంచి వార్షిక పరీక్షలు ఉండడంతో వీఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు అందజేశామని జిల్లా అధ్యక్షుడు మల్లెతుల రాజేంద్రపాణి పేర్కొన్నారు. శుక్రవారం శ్రీరాంపూర్ సిసిసి లోని వివిధ పాఠశాలలో వీఎన్ఆర్ ఫౌండేషన్ మరియు ఆల్ఫోర్స్ జూనియర్ కాలేజీల చైర్మన్ వి నరేందర్ రెడ్డి గారి సహకారంతో పరీక్ష ప్యాడ్లు అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల పట్ల భయాన్ని తొలగించి అవగాహనతో ప్రశాంతమైన మనసుతో పరీక్షలకు హాజరై మంచి ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఒత్తిడికి లోను కాకుండా తగు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో రేగల ఉపేందర్, కలవల శ్రీనివాస్, సంధినేని శ్రావణ్ గోపతి తిరుపతి వివిధ పాఠశాలల కరస్పాండెంట్ పాల్గొని విద్యార్థిని విద్యార్థులకు శుభాశీస్సులు అందించడం జరిగినది

## మత సామరస్యానికి ప్రతీక రంజాన్

**మంచిర్యాల, మార్చి 13(నినాదం):** మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండుగ అని మాజీ డిసిసి అధ్యక్షురాలు సురేఖ పేర్కొన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా కొక్కిరాల రఘుపతి రావు గారి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మంచిర్యాల శాసనసభ్యులు ప్రేమ్ సాగర్ రావు ఆధ్వర్యంలో హాజీపూర్, దండేపల్లి మండలంలో ముస్లీం సోదరీ మణులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ముస్లీం సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్లు, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

# శస్త్రచికిత్సలకు కేంద్ర బిందువుగా జిల్లా ఆసుపత్రి

**క్లిష్టమైన ఆపరేషన్లు చేసి ప్రజలకు భరోసా కల్పిస్తున్న జిల్లా ఆసుపత్రి వైద్యులు....**

**ప్రైవేట్ ఆస్పత్రిలో తగ్గుతున్న రోగుల సంఖ్య....**

**రోగుల సౌకర్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న ఆస్పత్రి సిబ్బంది...**

**ఎమర్జెన్సీ ఆపరేషన్‌లో పాల్గొంటున్న సూపర్డెంట్**



**పెద్దపల్లి రూరల్ మార్చి 13 (నినాదం):** గతంలో రోగులతో ప్రైవేటు ఆసుపత్రిలు కిటకిటలాడుతుండేది. ఈ మధ్యకాలంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరెంట్ రోగులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మెరుగైన వైద్యం, క్రిటికల్ ఆపరేషన్లు చేయ డంతో,ప్రజలంతా ప్రభుత్వ ఆసుపత్రి వైపు మొగ్గు చూపుతు న్నారు. ఇందులో భాగంగా పెద్ద కల్వాలకు చెందిన 51 సం,రాల ఒక మహిళకుడి వైపు తీవ్రమైన కడుపునొప్పితో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిం ది.ఆమెకు ఆపరేషన్ స్టార్ట్ చేసి లోపల చూసినప్పుడు గర్భ సంచి లో3 గడ్డలు, మూత్రాశయం, గర్భ సంచి మధ్యలో ఒక పెద్ద గడ్డ కం ప్యూటర్ పరికరం ద్వారా వైద్యులు కనుగొన్నారు.వెంటనే డాక్టర్లు అప్రమత్తమై మూత్రాశయం గడ్డ నీ గర్భ సంచిని చాలా జాగ్రత్త వహి స్తూ, ఈ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వ హించారు.అలాగే చంద పల్లె కు చెందిన 45 సం,రాల ఒక మహిళ కుడి భుజం పై సుప్రా స్పినేటస్ టెండన్ పాక్షికంగా తెగిపోయినది.ఆర్థ్రోస్కోపిక్ విధానం లో కుడి భుజం సుప్రాస్పినేటస్ టెం డన్ రిపేర్‌ను సుచర్ ఆంకర్‌తో, స్థిరపరచడం జరిగినది. రామగుండం కు చెందిన 19 సం,రాల ఒక మహిళకు ఎడమ మోకాలి అంటీరియర్ క్రూసియేట్ లిగమెంట్ ఏ.సి.ఎల్ పూర్తిగా చీలిపోయింది. ఆమెకు సెమిటెండినోసస్ సిలిస్ ఎస్.టి.జి, గ్రాఫ్ట్, ఎండోబటన్ ఫిక్సేషన్ ఉపయోగించి ఆర్థ్రోస్కోపిక్ ఏ.సి.ఎల్, పునర్నిర్మాణ శస్త్రచికిత్స చేసి ఆ మహిళ జబ్బును నయం చేశారు. జిల్లా పరిధిలోని ఆపరేషన్లు చేయడంలో ఆసుపత సూపర్డెంట్ కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రజలు అను కుంటున్నారు. ఇట్టి సర్జరీల లో పాల్గొన్న వైద్యుల బృందం గైనకాలజిస్ట్ డా.అనసూయ, ఆర్థోపెడిషియన్ డా. శశికాంత్,డా.వినయ్ కుమార్, జనరల్ సర్జన్ డా.విష్ణు చంద్రిక, అనేస్తేషియా డా.కృష్ణవేణి, డాక్టర్ స్వాతి,డా.భవాని, ఈ ఆపరేషన్ లలో సూపరింటెండెంట్ డా.కె.శ్రీధర్ కూడా పాల్గొన్నారు.పై పేర్కొన్న ఈ మూడు సర్జరీలు చేసిన వైద్య బృందాలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ప్రజలందరూ పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుతున్న నవ జాత శిశు కేంద్రం సేవలు,2 డి.ఎ.కో,సేవలు,ఆధునిక పరిజ్ఞానంతో కూడిన లాప్రోస్కోపిక్ శస్త్ర చికిత్సలు, యూరాలజీ సేవలు,రూట్ కెనాల్ సేవలను ఉపయోగించుకోవాలని,ఈ సేవలలో ఏవైనా ఇబ్బందులు ఎదురైనచో నేరుగా జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ ను కలవచ్చు అని ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భం గా ప్రజలందికి సూపరింటెండెంట్ చేయు విజ్ఞప్తి ఏమనగా వారికి సంబంధించిన పేషెంట్ హాస్పిటల్ లో ఉన్న సమయం లో సానిటేషన్,వాష్ రూమ్ శుభ్రత గురించి గాని ఎవరైనా డబ్బులు అడిగినా గాని,ఇతర ఏ సమస్య ఉన్నా కూడా నర్సింగ్ సూపరింటెండెంట్ ను ఆర్.ఎం.ఓ ,ను నేరుగా ను సంప్రదించగ లరు. లేని యెడల ఫిర్యాదులను కంప్లైంట్ బాక్స్ లో ఇవ్వవచ్చు,వారి సమస్యని వెంటనే పరిష్కారం చేయడానికి ప్రయత్నం చేస్తాం అని సూపరింటెండెంట్ పేర్కొన్నారు.ప్రభుత్వ ఆసుపత్రి లో అన్ని రకముల సేవలు ఉచితం ఎవ్వరికి లంచం ఇవ్వరాదు అని తెలియచేసారు.

# ఇందూర్ తిరుమలలో వైభవంగా స్వామివారి కళ్యాణం

## పాల్గొన్న మంత్రి కొండ సురేఖ

**నిజామాబాద్ ప్రతినిధి, మార్చి 13 (నినాదం) :** నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలంలోని నర్సింగ్ పల్లి లో గల ఇందూర్ తిరుమలలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజు స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. శుక్రవారం కళ్యాణ వేడుకల్లో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొని స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆలయం నేపథ్యం తెలుసుకొని తాను సంభ్రమాశ్చర్యాలకు గురి అయ్యానని మంత్రి అన్నారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం సేవా తత్పరత తో, సమాజ సేవ దృక్పథంతో, సమాజానికి జ్ఞానం అందించాలనే గొప్ప ఆలోచనతో ఈ ఆలయాన్ని శ్రీమాన్ నర్సింహారెడ్డి కట్టించడం చాలా గొప్ప విషయమని మంత్రి అన్నారు. స్వామివారి కల్యాణంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నానని, భవిష్యత్తులో అవకాశం దొరికితే మళ్లీ మళ్లీ ఇందూరు తిరుమలకు వస్తానని తెలిపారు. తిరుమల తిరుపతికి వెళ్లలేని వారు ఇందూరు తిరుమలలో ఆ భక్తిని, శక్తిని దక్కించు కోగలుగుతున్నారని అన్నారు. స్వామి వారి కల్యాణంలో పాల్గొంటే కన్యాదాన ఫలం వస్తుందని దేవనాథ జీయర్ స్వామి వారు అన్నారు. ఉదయం యజ్ఞ కార్యక్రమం ముగిసిన తరువాత స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు.





గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడంతో పరిసరాలు భక్తులతో నిండిపోయింది. ఈ కార్యక్రమాల్లో దేవనాథ జీయరు స్వామి, ప్రముఖ సినీ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ రెడ్డి, ఆలయ ప్రధాన ధర్మకర్త నరసింహారెడ్డి, సినీ హీరో ఆశిష్, విజయసింహ రెడ్డి, రాములు, ప్రవీణ్, పృథ్వి, నరాల సుధాకర్, నర్సారెడ్డి, రాజేశ్వర్, రమేష్, భాస్కర్, నరేందర్, మురళి, యాజ్ఞాచార్యులు అనంత ఆచార్య, సంపత్ కుమార్ ఆచార్య, రోహిత్ కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి కొండా సురేఖకు ఘన స్వాగతం**

అటవీ శాఖ పర్యావరణ ఎండోమెంట్స్ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ కి నిజామాబాద్ కార్పొరేషన్ డిసిసి అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ కార్పొరేషన్ డీసీసీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ, నిజామాబాద్ నగర మేయర్ ఉమా రాణి, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, పీసీసీ ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, మాజీ నగర మేయర్ ఆకుల సుజాత, ఏఐసీసీ కోఆర్డినేటర్ కప్కర్ గన్‌రాజ్, మాజీ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జగడం సుమన్ పాల్గొన్నారు.

# నేటి రైతులకు ఆదర్శం.. ఈ వృద్ధ రైతు

## గ్రావిటీ మెథడ్ ద్వారా పంట పొలాలకు నీళ్లు

## కరెంటు మోటారు లేకుండా సేద్యం

## కష్టం చేస్తే ఆరోగ్యం అంటున్న వృద్ధుడు



**జమ్మికుంట, మార్చి 12 (నినాదం):** శాస్త్ర సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చెందుతున్న నేటి తరుణంలో కరెంటు మోటార్లతో నీటిని పెట్టకుండా బావి నుంచి తోడిన నీళ్లను గ్రావిటీ మెథడ్ ద్వారా అనాదికాలం వ్యవసాయం చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు ఈ 84 ఏళ్ల వృద్ధుడు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తున్నప్పటికీ పురాతన పద్ధతిలో పంటలకు నీరందించే విధానాన్ని ఇప్పటికీ జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన గిరివేన కొమరయ్య అనే రైతు తనకున్న 10 గుంటల భూమిలో పాత వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ అందరినీ ఆలోచింపజేసే విధంగా వ్యవసాయ పనులను చేస్తున్నాడు. కొమరయ్య గత పది సంవత్సరాలుగా తనకున్న 10 గుంటల భూమిలో కూరగాయలను సాగుచేస్తూ వాటికి అవసరమైన నీటిని వాతం పద్ధతి ద్వారా ఉపయోగిస్తూ పంటలను సాగు చేస్తున్నాడు. ఇన్ని సంవత్సరాల కాలంలో ఇప్పటివరకు కరెంటు మోటారు ఉపయోగించకుండా రోజు తన కష్టాన్ని నమ్ముకుంటూ బావికి రెండు కట్టలు కట్టి ఒక్క బకెట్ సహాయంతో లోపలికి పంపించి నీటిని బయట ఉన్న పంట పొలంలో పడేవిధంగా చేస్తూ సాగు చేస్తున్నాడు. ఇంట్లో విరామ సమయాన్ని వృధా చేయకుండా నేటి యువత సైతం పాత పద్ధతిలోనే వ్యవసాయం చేస్తే కరెంటు ఆదా కావడంతోపాటు శారీరక శ్రమ శరీరానికి రావడం వల్ల ఏ రోగం రాకుండా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చునని రైతు నిరూపించాడు. శ్రమను నమ్ముకున్న ప్రతి ఒక్క రైతన్నకు కొమరయ్య చూపిన మార్గం భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండాలని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# వృద్ధుల డే కేర్ సెంటర్లో అన్ని వసతులు కల్పించాలి

## కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, మార్చి 13 (నినాదం):** జిల్లా కేంద్రంలో వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్లో వారికి కావాల్సిన అన్ని వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వనపర్తి పట్టణంలోని రామ్ నగర్ లో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ "ప్రణామ్"ను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న వసతులను పరిశీలించి అక్కడే ఉన్న పలువురు సీనియర్ సిటిజెన్లతో మాట్లాడారు. సీనియర్ సిటిజన్లకు అందిస్తున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్న కలెక్టర్ వృద్ధులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారికి ఆదేశించారు. వృద్ధులు సౌకర్యవంతంగా సమయం గడపడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు, ఇతర సేవలను సమకూర్చాలని సూచించారు. అదేవిధంగా ఈ సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్‌ను ఉగాది నాటికి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశించారు. వృద్ధులకు అవసరమైన సేవలు అందించేలా కేంద్రాన్ని అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి సుధారాణి, తహసిల్దార్ రమేష్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# కుత్బుల్లాపూర్‌ను మరింత ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా..

## బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, మార్చి 13 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జిహెచ్ఎంసి దుండిగల్ సర్కిల్ పరిధి భౌరంపేట లోని లహరి గ్రీన్ పార్క్ నందు బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ వివిధ విభాగాల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఔటర్ రింగ్ రోడ్ నుంచి కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారిందని తద్వారా నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో రోడ్డుపై వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మంజీరా వాటర్ పైప్ లైన్ సదుపాయాన్ని కల్పించడంతోపాటు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మరింత అభివృద్ధి పరచాలని ఎమ్మెల్యే కు విన్నవించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌనిక వసతుల కల్పనలో భాగంగా గత 12 ఏళ్ల కాలంలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి కుత్బుల్లాపూర్ లోని అన్ని ప్రాంతాలలో మౌనిక వసతులు కల్పించామని, రానున్న రోజుల్లో మౌలిక వసతులను మరింత అభివృద్ధి పరిచేందుకు కృషి



చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, లహరి, గ్రీన్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ వెలగపూడి శ్రీనివాస్, పాక్స్ డైరెక్టర్ మిద్దెల బాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు బెంబడి బుచ్చిరెడ్డి, మురళి యాదవ్, నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు ఎస్.వి. సురేందర్ రెడ్డి, ధర్మా రెడ్డి, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు శుభాశీస్సులు

- **మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు**

**సిద్దిపేట, మార్చి 13(నినాదం):** నేటినుండి ప్రారంభం అయ్యే పదవతరగతి పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థిని,విద్యార్థులకు మాజీ మంత్రి , ఎమ్మెల్యే హరీష్‌రావు శుభాశీస్సులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలోని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలల్లో 100% ఉత్తీర్ణత సాధించాలని ఆశిస్తున్నా. సిద్దిపేట నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించామని.. ఇందుకు విద్యా శాఖ యంత్రాంగంతో కలసి సమీక్ష నిర్వహించి, అన్ని వసతులు కలిపించామని చెప్పారు ""మీరు కూడా కష్ట పడి చదివారు.. మీ కష్టం వృధా కాదు... మీ భవిష్యత్తు పునాది పదవ తరగతే""అని.. "ఇష్టపడి... ఆత్మవిశ్వాసం తో పరీక్షలు వ్రాయండని తెలిపారు.



# వంట గ్యాస్ కోసం ఆందోళన చెందొద్దు

## కలెక్టర్ హైమావతి



**సిద్దిపేట, మార్చి 13(నినాదం):** ప్రభుత్వం జిల్లాకు అవసరమైన వంట గ్యాస్ సరఫరా చేస్తుందని ప్రజలెవరు వంటగ్యాస్ కొరకు ఆందోళన చెందరాదని జిల్లా కలెక్టర్ కే. హైమవతి అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కే. హైమావతి జిల్లా ప్రజల ఉద్దేశించిమాట్లాడుతూ మన జిల్లాలో 03 లక్షల 32 వేల 850 డొమెస్టిక్ వంట గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని, దాదాపు 1500 కమర్షియల్ గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయని గతంలో ప్రభుత్వం సరఫరా చేసిన విధంగానే ఇప్పుడు కూడా మన జిల్లాకు అవసరమైన వంట గ్యాస్ ను ప్రభుత్వం ఎలాంటి ఇబ్బంది లేకుండా సరఫరా చేస్తుందని అన్నారు. ఎప్పటిలాగే మన జిల్లా ప్రజలకు అవసరమైన స్థాయిలో వంట గ్యాస్ సరఫరా చేస్తున్నందున ప్రజలు అనవసర భయాందోళనలకు గురై ఎక్కువ సిలిండర్ లను బుక్ చేసుకోరాదని అన్నారు. ఎక్కువ సిలిండర్లను బుక్ చేసుకోవడం వలననే ఇబ్బందులు తలెత్తుతాయి కాబట్టి ప్రజలు వంటగ్యాస్ విషయంలో ఎలాంటి ఆందోళన చెందరాదని సూచించారుఅదేవిధంగా కమర్షియల్ వంట గ్యాస్‌ను కూడా సరఫరా చేస్తామని తెలిపారు.

NINADAM CINEMA

# అలా మొదలైంది.. మా ప్రేమ ప్రయాణం

## నయనికతో ప్రేమను పంచుకున్న అల్లు శిరీష్

టాలీవుడ్ యువ హీరో అల్లు శిరీష్ ఇటీవల పెళ్లి చేసుకుని కొత్త జీవితాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. మార్చి 6న హైదరాబాద్‌లో జరిగిన ఘనమైన వేడుకలో తన ప్రియురాలు నయనిక రెడ్డిని వివాహం చేసుకున్నారు. ఈ పెళ్లి వేడుకకు కుటుంబ సభ్యులు, సినీ ప్రముఖులు హాజరై నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. పెళ్లి తర్వాత ఈ జంట తమ తమ పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ, తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో అల్లు శిరీష్ తన లవ్ స్టోరీ, పెళ్లి నిర్ణయం, హనీమూన్ ప్లాన్స్ గురించి ఆసక్తికర విషయాలు వెల్లడించారు. అల్లు శిరీష్ తెలిపిన వివరాల ప్రకారం, నయనికను మొదటిసారి ఒక పార్టీలో కలిశానని చెప్పారు. ఆ పార్టీని హీరో నితిన్, ఆయన భార్య షాలిని కందుకూరి ఏర్పాటు చేశారు. అది హీరో వరుణ్ తేజ్, హీరోయిన్ లావణ్య త్రిపాఠి వివాహం సందర్భంగా జరిగిన పార్టీ అని ఆయన వివరించారు. నయనిక, శాలినికి బెస్ట్ ఫ్రెండ్ కావడంతో అక్కడే మొదటిసారి ఇద్దరం కలుసుకున్నామని చెప్పారు. ఆ పరిచయం క్రమంగా ప్రేమగా మారిందని శిరీష్ వెల్లడించారు. డేటింగ్ ప్రారంభించినప్పటి నుంచే ఇద్దరూ పెళ్లి గురించి మాట్లాడుకున్నామని అల్లు శిరీష్ తెలిపారు. భవిష్యత్తులో కుటుంబం ఏర్పాటు చేసుకోవాలని ఇద్దరికీ ఒకే అభిప్రాయం ఉందని చెప్పారు. తమకు పుట్టబోయే పిల్లలు ఇంట్లో తప్పకుండా తెలుగులో మాట్లాడాలని



కూడా ఇద్దరూ నిర్ణయించుకున్నామని కూడా చెప్పారు. నయనికలో తనకు అత్యంత నచ్చిన విషయం ఆమె సెన్స్ ఆఫ్ హ్యూమర్ అని శిరీష్ చెప్పారు. ఆమె చాలా సూటిగా మాట్లాడుతుందని, ఏ విషయమైనా నేరుగా చెప్పేస్తుందని అన్నారు. ఏదైనా నచ్చకపోతే అదే విషయాన్ని స్పష్టంగా చెబుతుందని తెలిపారు. తన జీవితంలోని అన్ని విషయాలను ఆమెతో పంచుకుంటానని, తన సినిమాల గురించి కూడా నయనిక నిజాయితీగా అభిప్రాయం చెబుతుందని శిరీష్ వెల్లడించారు. ఒకసారి నయనికతో కలిసి కాఫీ షాప్‌కు వెళ్లిన విషయం బయటకు తెలిసి కుటుంబ సభ్యులకు కూడా సమాచారం వెళ్లిందని శిరీష్ చెప్పారు. స్నేహా రెడ్డి, నయనిక సోదరి నిహారిక మంచి స్నేహితులు కావడంతో వారి ప్రేమ గురించి కుటుంబంలో అందరికీ తెలిసిపోయిందని చెప్పారు. హనీమూన్ గురించి కూడా అల్లు శిరీష్ మాట్లాడారు. ప్రస్తుతం ఇద్దరూ తమ తమ పనుల్లో బిజీగా ఉన్నారని చెప్పారు. కొత్త అపార్ట్‌మెంట్‌ను రెడీ చేసుకుంటున్నామని, నయనిక కూడా తిరిగి తన పనితో బిజీ అయిందని చెప్పారు.

# ఓటిటిలోకి రవితేజ భర్త మహాశయులకు విజ్ఞప్తి

## మాస్ కాదాస్ ఫంకీ



మాస్ మహారాజా రవితేజ హీరోగా తెరకెక్కిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'భర్త మహాశయులకు' చివరకు ఓటిటిలోకి వచ్చేసింది. దర్శకుడు కిషోర్ తిరుమల రూపొందించిన ఈ సినిమాలో హీరోయిన్లుగా ఆషిక రంగనాథ్, డింపుల్ హయతి నటించారు. ఈ చిత్రం ఈ ఏడాది సంక్రాంతి కానుకగా థియేటర్లలో విడుదలై మంచి స్పందనను అందుకుంది. సంక్రాంతి సందర్భంగా విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద డీసెంట్ కలెక్షన్స్ సాధించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా రవితేజ స్టైల్ మాస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో పాటు ఫ్యామిలీ ఎలిమెంట్స్ కూడా ఉండటంతో ప్రేక్షకులు సినిమాను బాగా ఆదరించారు. మాస్ మహారాజా గత కొన్ని సినిమాలతో పోలిస్తే ఈ సినిమా థియేటర్లలో మంచి రన్‌ను నమోదు చేసింది. అయితే థియేటర్లలో విడుదలైన తర్వాత ఈ సినిమా ఓటీటీలోకి రావడానికి కొంత సమయం పట్టింది. ఇతర సినిమాలు తక్కువ సమయంలోనే ఓటిటిలోకి వస్తున్న నేపథ్యంలో 'భర్త మహాశయులకు' మాత్రం ఆలస్యంగా డిజిటల్ స్ట్రీమింగ్‌కు వచ్చింది. ఇక తాజాగా ఈ సినిమా ఓటిటి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ చిత్రానికి సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటిటి ప్లాట్‌ఫార్మ్ జిఇఇ5 సొంతం చేసుకుంది. ఈ చిత్రాన్ని తెలుగు మాత్రమే కాకుండా తమిళ్, కన్నడ, మలయాళ భాషల్లో కూడా ప్రేక్షకులకు అందుబాటులో ఉంచారు. మాస్ కా దాస్ విశ్వక్ సేన్ హీరోగా కయాదు లోహర్ హీరోయిన్ గా దర్శకుడు అనుదీప్ కే వి తెరకెక్కించిన ఫన్ డ్రామా చిత్రమే 'ఫంకీ' థియేటర్స్ లో ఒక డిజప్పాయింట్ చేయగా, ఈ మూవీ ఓటీటీలో ఈ సినిమా స్ట్రీమింగ్ కి వచ్చేసింది. ఈ చిత్రాన్ని పాపులర్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ఈ సినిమా నేటి నుంచి అందుబాటులోకి వచ్చింది. అనుదీప్ గత సినిమా ప్రిన్స్ కూడా థియేటర్స్ తర్వాత ఓటీటీ లోకి వచ్చాక ఓ వర్గం ఆడియెన్స్ ని ఫ్యాన్స్ చేసుకుంది. మరి అలానే ఫంకీ కి కూడా జరుగుతుందా లేదా అనేది వేచి చూడాలి.

# అల్లు అర్జున్, అట్లీల ప్రాజెక్ట్‌పై కథనాలు

## ఆసక్తి రేకెత్తిస్తున్న తాజావార్తలు

ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ఆసక్తిని రేకెత్తిస్తున్న ప్రాజెక్టులలో ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు అట్లీ కలయికలో రూపొందుతున్న సినిమా ఒకటి. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌ను కేవలం పాన్ ఇండియా స్థాయిలోనే కాకుండా అంతర్జాతీయ ప్రమాణాలతో గ్లోబల్ మార్కెట్‌ను లక్ష్యంగా చేసుకుని రూపొందిస్తున్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే జవాన్ చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న అట్లీ, ఈ కొత్త ప్రాజెక్ట్‌ను భారీ స్థాయిలో విడుదల చేయాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికర వార్త ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. సినిమా గ్లింప్స్‌ను బాలీవుడ్ బాద్షా షారూఖ్ ఖాన్ చేతుల మీదుగా విడుదల చేయాలని చిత్ర బృందం ఆలోచిస్తున్నట్టు టాక్ వినిపిస్తోంది. ఒకవేళ ఇది నిజమైతే, అది సాధారణ ప్రమోషన్ మాత్రమే కాకుండా గ్లోబల్ మార్కెటింగ్ స్ట్రాటజీగా మారే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు. ఇప్పటికే అల్లు అర్జున్ పుష్ప2 సినిమాతో దేశవ్యాప్తంగా భారీ గుర్తింపు పొందారు. ముఖ్యంగా గల్ఫ్ దేశాలు, ఉత్తరాది రాష్ట్రాల్లో ఆయనకు మంచి ఫ్యాన్ బేస్ ఏర్పడింది. అయితే షారుక్ ఖాన్‌కు ఉన్న అంతర్జాతీయ క్రేజ్ మరో స్థాయిలో ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా ఆయనకు కోట్లాది అభిమానులు ఉన్నారు. అందుకే షారుక్ ఖాన్ ఈ సినిమా గ్లింప్స్‌ను లాంచ్ చేస్తే, అది కేవలం ఒక ప్రాంతీయ సినిమా ప్రమోషన్‌గా కాకుండా 'ఇండియన్ బిగ్గెస్ట్ ప్రాజెక్ట్'గా ప్రపంచ మీడియా దృష్టిని ఆకర్షించే అవకాశం ఉంది. ముఖ్యంగా ఓవర్సీస్ మార్కెట్‌లో సినిమాపై భారీ హైప్ ఏర్పడుతుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. షారుక్ ఖాన్ సోషల్ మీడియా ద్వారా జరిగే ప్రచారం



ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులకు చేరుతుంది. దీంతో అమెరికా, యూరప్, గల్ఫ్ దేశాలు వంటి విదేశీ మార్కెట్లలో సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులకు భారీ డిమాండ్ ఏర్పడే అవకాశముంది. ప్రస్తుతం ఈ వార్తలపై అధికారిక ప్రకటన వెలువడలేదు.



# నాలుగేళ్ల వివాహ బంధానికి.. చెల్లుచీటి

## నటి హన్సిక

నటి హన్సిక తన భర్త నుంచి విడాకులు తీసుకుని,. నాలుగేళ్ల వివాహబంధానికి ముగింపు పలికారు. విడాకుల అనంతరం ఆమె తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. పంజాబీ పదం 'చార్దీ కలా..' అని రాశారు. ఎప్పుడూ ఉత్సాహంతో ముందుకుసాగాలని.. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశను కోల్పోవద్దని దీని అర్థం. 2022 డిసెంబర్‌లో సోహైల్-హన్సిక వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని 'లవ్ షాదీ డ్రామా' అనే పేరుతో డాక్యుమెంటరీ సిరీస్‌గా కూడా విడుదల చేశారు. గతేడాది ఆగస్టులో ఆమె సోషల్ మీడియాలో పెళ్లి ఫొటోలు డిలీట్ చేయడంతో విడాకుల రూమర్స్ మొదలయ్యాయి. మార్చి 11న వీరికి కోర్టు విడాకులు మంజూరుచేసింది. టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకులను తన అందం, నటనతో అలరించిన ప్రముఖ నటి హన్సిక మోత్వాని వ్యక్తిగత జీవితానికి సంబంధించిన వార్త నెట్టింట ఎంతగా వైరల్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సోహైల్ కతూరియాని ప్రేమించి పెళ్లి చేసుకున్న హన్సిక అతనికి విడాకులు ఇచ్చినట్టు జోరుగా ప్రచారం సాగింది. కొంతకాలంగా ఈ జంట మధ్య విభేదాలు ఉన్నాయని ప్రచారం జరుగుతుండగా, ముంబైలోని బాంద్రా కోర్టు వీరి విడాకులను ఖరారు చేసిందని కొన్ని మీడియా వర్గాల్లో వార్తలు వెలువడ్డాయి. అయితే ఈ విషయంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన మాత్రం వెలువడలేదు. అయితే తాజాగా హన్సిక తన సోషల్ మీడియాలో ఓ ఇంట్రెస్టింగ్ పోస్ట్ పెట్టింది. చర్ది కాలా ఆల్వేస్ అనే పంజాబీ కొటేషన్ షేర్ చేయగా, దాని అర్థం ఏంటంటే.. ఎలాంటి కష్టాలలో ఉన్నా కూడా పాజిటివ్‌గా, ధైర్యంగా ఉండాలని దీని అర్థం.అంటే తన జీవితంలో మరో కొత్త అధ్యాయం ప్రారంభించడానికి తాను సిద్ధంగా ఉన్నానని హన్సిక ఇన్‌డైరెక్ట్ కామెంట్ పెట్టి ఉంటుందని నెటిజన్స్ భావిస్తున్నారు. ఇక హన్సిక మోత్వానీ, వ్యాపారవేత్త సోహైల్ కతూరియా 2022 డిసెంబర్ 4న రాజస్థాన్‌లోని జైపూర్‌లో అట్టహాసంగా జరగగా, ఈ పెళ్లి వేడుక ఎంతో గ్రాండ్‌గా జరిగి అప్పట్లో సోషల్ మీడియాలో కూడా పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. పెళ్లి తర్వాత కొంతకాలం వరకు ఈ జంట సంతోషంగా జీవిస్తున్నట్లు కనిపించింది. అయితే పెళ్లి అనంతరం కొన్ని నెలలకే వీరిద్దరి మధ్య విభేదాలు మొదలయ్యాయని సినీ వర్గాల్లో ప్రచారం జరిగింది. గత కొంతకాలంగా హన్సిక తన భర్తకు దూరంగా ఉంటూ తల్లితో కలిసి నివసిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. అదే సమయంలో హన్సిక తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా నుంచి భర్తతో కలిసి ఉన్న పెళ్లి ఫోటోలను తొలగించడం కూడా ఈ పుకార్లకు మరింత బలం చేకూర్చింది.

Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787